నేటి దినపత్రిక
# సూర్య
# అమరావతి
గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్
శనివారం
6 జనవరి
2024
పేజీలు 10

చేపల మాఫియా బరితెగించింది. కోడి వ్యర్థాలతో ( చికెన్ వేస్టు తో) కృష్ణా, గుంటూరు జిల్లాల్లో యథేచ్ఛగా క్యాట్ ఫిష్ రకం చేపల పెంపకం చేస్తున్నారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం గారపాడు, గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం సేకురులో ఈ జాడ్యం హద్దు మీరింది. ఈ చేపల మాఫియాకు లీడర్లుగా రాంబాబు,అతని పుత్రరత్నం వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. గుంటూరు, విజయవాడ, మంగళగిరి కార్పొరేషన్లలోని చికెన్ స్టాల్స్ నుండి చికెన్ వేస్టును సేకరించి చేపలకు మేతగా వేస్తున్నారు. అధికారులను రమ్మనండి ఇవే చేపలు తినిపిస్తామంటూ ఎదురు దాడి చేస్తున్నారు. చికెన్ వేస్టుతో చేపల పెంపకం నిషేధిస్తూ ప్రభుత్వం జీవో - 56 జారీ చేసింది. చర్యలు తీసుకునేందుకు పోలీసు, రెవెన్యూ, మత్స్య, రవాణా శాఖల అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. కాగా, చర్యలు తీసుకోవాల్సి కమిటీ సభ్యులు చోద్యం చూస్తున్నారు. దుర్వాసనతో చేపల చెరువులు వున్న గ్రామాల్లోని ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇటువంటి చేపలను తిన్న ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు.

## బరితెగించిన..
# చేపల మాఫియా..!

2 లో

- కోడి వ్యర్థాలతో (చికెన్ వేస్టుతో) యథేచ్ఛగా చేపల సాగు
- ప్రజారోగ్యానికి తూట్లు
- చోద్యం చూస్తున్న చర్యలు తీసుకోవాల్సిన అధికారులు
- జీవో -56 ద్వారా కోడి వ్యర్థాలతో చేపల పెంపకం పూర్తిగా నిషేధం
- కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మితిమీరిన క్యాట్ ఫిష్ రకం చేపల పెంపకం
- రాంబాబు అనే వ్యక్తి ఈ కోడి వ్యర్థాల చేపల మాఫియాకు లీడర్
- కోడి వ్యర్థాలతో సాగు చేసే చేపలు తింటే ఏమి కాదంటున్న రాంబాబు పుత్రరత్నం
- అధికారులను రమ్మనండి అవే చేపలు వండి పెడతానంటున్న అంజి బాబు
- కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పరాకాష్టకు చేరిన రాంబాబు చేపల దందా






అర్హత పొందిన లబ్ధిదారుల ఖాతాలకు
## రూ.5కోట్లు జమ
- పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం
- గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి వెల్లడి 7లో



జాతీయ స్థాయిలో..
## గుంటూరుకు గుర్తింపు
కలెక్టర్ చొరవతో మంగళగిరి చేనేతకు మలుపు
ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి
వివరాలు 7లో



దారికట్టిన రేషన్
# దందా
- నల్ల బజారుకు పూర్తి స్వేచ్ఛ
- మచ్చుకైనా కనిపించని తనిఖీలు
- స్పందించని అధికారులు 2



ఆ తహసీల్దార్
# కాసులు ఇస్తే.. వరాలిస్తారు
- సొంత డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న వైనం - ప్రభుత్వ నిబంధనలు పాటించని తహసీల్దార్

• 7లో..

సంతృప్త స్థాయిలో..
# పథకాలు
అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేందుకు
ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమం
ఈ విడతలో 2,934 మందికి రూ.4.37కోట్ల లబ్ధి
ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు



వివరాలు 7లో...



# బరితెగించిన.. చేపల మాఫియా..!

**కృష్ణా / గుంటూరు మేజర్ న్యూస్ :** కృష్ణా, గుంటూరు జిల్లాల్లో చేపల మాఫియా రెచ్చిపోతోంది. తమకు అడ్డే లేదంటూ బరితెగించింది. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ ఎదురు దాడికి దిగింది. దుర్వాసనను భరాయిస్తూ నోరులేని గ్రామస్థులు మిన్నకుండి పోతున్నారు. గట్టిగా ఎవరైనా ప్రశ్నిస్తే అధికారులను రమ్మనండి ఇవే చేపలను తినిపిస్తాం.. ఏ రోగాలు వస్తాయో చూద్దామని చేపల మాఫియాకు లీడర్ గా వున్న రాంబాబు కుమారుడు అంజిబాబు బాహాటంగా సవాలు విసురుతున్నాడు. చేపలకు మేతగా చికెన్ వేస్తును వినియోగించడం నిషేధిస్తూ ప్రభుత్వం జీవో -56 విడుదల చేసింది. ఈ జీవోలో పేర్కొన్న అధికారులు చర్యలు తీసుకోవడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. గుంటూరు, విజయవాడ, మంగళగిరి కార్పొరేషన్లలోని చికెన్ స్టాల్స్ నుండి కోడి వ్యర్థాలను ఈ చేపల మాఫియా సేకరిస్తున్నా సంబంధిత ప్రజారోగ్య శాఖల అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వున్నారు. కోడి వ్యర్థాల తరలింపులో ఆయా శాఖల అలసత్వం కారణంగా నగర వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. చేపల చెరువుల పరిసరాల్లో నివసించే ప్రజలు దుర్వాసనను భరించలేక పోతున్నారు.

పశ్చిమగోదావరి జిల్లా నుండి వచ్చిన కొందరు అక్రమార్కులు వాగులు, మురుగు నీటిని కాల్వల పక్కన చేపల చెరువులు తవ్వి ఆ నీటితో చేపల పెంపకం చేస్తున్నారు. మురుగు, కలుషిత నీటిలోనే కోడి వ్యర్థాలతో చేపల సాగు చేస్తూ పరాకాష్టకు తెరతీశారు. గతంలో మత్స్యశాఖ అధికారులు తమ తమ పరిధిలోని చేపల చెరువులను తనిఖీలు చేసి కోడి వ్యర్థాలతో చేపల సాగు నిషిద్ధమని తెలుపుతూ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులు జారీ చేసే క్రమంలో అధికారులు చెరువులను తనిఖీ చేయగా క్యాట్ ఫిష్ రకానికి చెందిన పంగస్ చేపలతో పాటు ప్రజలు అమితంగా భుజించే బొచ్చా, రాగండి, రూప్ చంద్ రకాల చేపలను కూడా కోడి వ్యర్థాలతోనే సాగు చేస్తున్నట్లు వెలుగు చూడటం గమనార్హం.




గతంలో రాంబాబు చేపల చెరువుల పై చేబ్రోలు పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీ

### జీవో -56 ఏం చెబుతుంది

కోడి వ్యర్థాలతో చేపలు సాగు చేయడం ద్వారా ప్రజారోగ్యానికి హానితో పాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. వ్యర్థాలతో కలుషితమైన చెరువుల్లోని నీటిని... తాగునీటి కాలువలు,నదుల్లో వదలడం ద్వారా ఆ నీటిని తాగిన ప్రజలు కలరా,డయేరియా వంటి అంటు రోగాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక జబ్బులు వచ్చే అవకాశం వుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కోడి వ్యర్థాలతో పెరిగిన చేపలను ఆహారంగా తీసుకోవడం మూలాన గుండె, కాలేయం, మూత్రపిండాలు తదితర అవయవాలు దెబ్బతిని ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముందని వైద్యులు సూచిస్తున్నారు. తదనుగుణంగా మత్స్యశాఖ జీవో-56 ద్వారా కోడి వ్యర్థాలతో చేపల సాగు నిషిద్ధం చేసింది. చికెన్ దుకాణాల నుండి కోడి వ్యర్థాలను తరలించే వాహనాలు,వ్యర్థాలను చేపల మేతగా వేసే చెరువుల పై చర్యలు తీసుకునేందుకు కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో తహశీల్దార్ చైర్మన్‌గా.. మత్స్యశాఖ ఎఫ్డిఒ,పోలీసు స్టేషన్ ఎస్ హెచ్ ఓ,రవాణా శాఖ మోటారు వెహికిల్ ఇన్స్పెక్టర్ సభ్యులుగా ఏర్పాటు చేసి చర్యలకు ఉపక్రమించింది. కాగా జీవో-56 అనేది ఒకటుందని..చికెన్ వ్యర్థాలపై చర్యలు తీసుకోవాలని.. నేటికి చాలా వరకు ప్రభుత్వ అధికారులకు అవగాహన లేకపోవడం గమనార్హం.

### నామ మాత్రంగా అధికారుల చర్యలు

కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఏళ్ల తరబడి యథేచ్ఛగా కోడి వ్యర్థాలతో చేపల సాగు జరుగుతున్నా అధికారుల చర్యలు నామ మాత్రమే అని ఆయా చెరువులు వున్న గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు చేసిన ఒకటి, రెండు రోజులు నోటీసుల పేరుతో హడావుడి చేయడం తప్పా.. చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని చెబుతున్నారు. అధికారులు తనిఖీల పేరిట చెరువుల యజమానులకు నోటీసులు ఇచ్చి వెనుదిరిగిన వెంటనే కోడి వ్యర్థాల వాహనాలు చెరువుల వద్ద ప్రత్యక్షమౌతాయని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెను ముప్పుగా వాటిల్లిన ఇటువంటి చెరువులను అరికట్టక పోవడంతో జిల్లాల్లో రోజుకొక చోట పుట్టగొడుగుల్లా చెరువులు పుట్టుకొస్తున్నాయి.

### కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనే ఎందుకీ జాడ్యం

గతంలో కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని చేపల చెరువుల యజమానులకు కోడి వ్యర్థాలతో చేపల పెంపకం అంతగా తెలియదు. పంగస్ చేపల పెంపకం పేరుతో పశ్చిమ గోదావరి జిల్లా నుండి వచ్చిన కొందరు ఈ జాడ్యాన్ని అలవాటు చేసినట్లు చెబుతున్నారు. ఈ చేపల మాఫియాకు




గుంటూరులో రూ.50వేలు జరిమానా విధించిన మత్స్యశాఖ

లీడర్ గా రాంబాబు అనే వ్యక్తి వ్యవహరిస్తున్నట్లు. ఆయా గ్రామస్తులు చెబుతున్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని కృష్ణా నది, డెల్టా ప్రాంతం, పశ్చిమ డెల్టా కాలువలు, ఏడాది పొడవున ప్రవహించే కాలువల వల్ల నీటి లభ్యత అధికంగా వుండటం, కోడి వ్యర్థాలతో వాటిల్లే అనర్థాల పట్ల ప్రజలకు పెద్దగ అవగాహన లేకపోవడం,అధికారుల ఉదాసీనత వెరసి కోడి వ్యర్థాలతో చేపల సాగు మూడు పువ్వులు ఆరు కాయలు గా సాగుతోంది.



ఈయనే చేపల చెరువుల యజమాని రాంబాబు. కోడి వ్యర్థాలతో చేపల పెంపకం అనే జాడ్యాన్ని కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ప్రవేశపెట్టడంలో ఆద్యుడు అని చెబుతున్నారు. ఆయా జిల్లాల్లో వందలాది ఎకరాల్లో చేపల చెరువులు తవ్వి, లీజులకు తీసుకొని యథేచ్ఛగా చికెన్ వేస్టుతో చేపల పెంపకం చేస్తున్నాడు. చికెన్ వేస్టుతో చేపల పెంపకం చేసే ముఠాకు ఈయనే పెద్దమనిషి.ఈయనకు అంజిబాబు అనే పుత్రరత్నం వున్నాడు. చేపలకు మేతగా చికెన్ వేస్టు వేయడం నిషేధం కదా.. అవి తిన్న ప్రజలు జబ్బుల బారిన పడతారని ఎవరైనా ప్రశ్నిస్తే అంజిబాబు దగ్గర వింతైన సమాధానం వుంది. ఎవరు వస్తారో రమ్మనండి మీరోస్తారా.. ప్రభుత్వ అధికారులు వస్తారా రమ్మనండి ఇవే చేపలు వండి తినిపిస్తాను.. ఏం రోగాలు వస్తాయో చూద్దాం.. ఎవరికైనా ఏమైనా రోగాలు వస్తే అప్పుడు చెరువులు మూసేస్తాం అంటూ సమాధానం ఇస్తున్నాడు. గుంటూరు, విజయవాడ, మంగళగిరి కార్పొరేషన్ల పరిధిలోని చికెన్ స్టాల్స్ నుండి చికెన్ వేస్టును సేకరించి వాహనాల ద్వారా యథేచ్ఛగా చేపల చెరువులకు ఈ ముఠా బహిరంగంగా తరలిస్తున్నా పట్టించుకునే వాళ్లే లేకపోవడం శోచనీయం.

# దారికట్టిన రేషన్ దందా...

- నల్ల బజారుకు పూర్తి స్వేచ్ఛ
- మచ్చుకైనా కనిపించని తనిఖీలు
- స్పందించని అధికారులు

**తిరువూరు మేజర్ న్యూస్ :** మండలంలో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా సాగుతుంది. ఈ ఆగడాలకు అడ్డే లేకుండా పోయింది. అంగట్లో సరుకుల్లా పేదల బియ్యం దొరుకుతుండడంతో రేషన్ అక్రమ రవాణా ఆడిందే ఆటగా పాడిందే పాటగా యదేచ్ఛగా జరుగుతుంది. తిరువూరు మండలంలోని కొందరు అక్రమార్కులతో కొమ్మక్కై అక్రమార్జనకు పాల్పడుతూ జేబులు నింపుకుంటున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. అడిగే వారు అడ్డుకునేవారు కనుచూపుమేరలో కనిపించకుండా పోవడంతో అక్రమ రేషన్ వ్యాపారులు ఆట సాగుతుందని మండల ప్రజలు పలు శాఖల అధికారులపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. తిరువూరు మండలంలో 20 గ్రామపంచాయతీలకు సంబంధించి నిరుపేద ప్రజలకు సుమారు 2870 క్వింటాల రేషన్ బియ్యం పౌర సరఫరాల శాఖ ద్వారా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ అందిస్తుంది. 27 గ్రామాలలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా 15 వాహనాల ద్వారా ఇంటింటి సరఫరా చేసే కార్యక్రమం చేపట్టింది. అయినా కూడా గుంట కాడ నక్కలాగా కాపుకాసిన అక్రమార్కులు పేదల బియ్యాన్ని ఎలా కొల్లగొట్టాలని ఆలోచనతో గ్రామాల్లో గద్దల్లా వాలుతున్నారు. నిరుపేదల బియ్యం పై కన్నేసిన అక్రమార్కులు తిరువూరులో పలు రకాలుగా వాటిని కొనుగోలు చేయడం ద్వారా అక్రమ రేషన్ వ్యాపారం అక్రమార్కులకు కల్పతరువుగా మారి జేబులు నింపుతున్నది. పలు సందర్భాలలో పట్టుబడిన 6ఏ కేసులు నమోదు చేసిన ధన దాహానికి అలవాటు పడిన అక్రమార్కులు ఇంకా రెచ్చిపోతున్నారు.అక్రమరేషన్ దందాపై అధికారులు నిఘా పెట్టి వాహనాలు పట్టుకుని కేసులు నమోదు చేస్తున్న వ్యాపారులు మాత్రం బేకాతరు చేయడం లేదు. రేషన్ దందాను నిలవరించవలసిన అధికారులు ఆవైపుగా ప్రయత్నాలు చేయకపోవడమే కారణం అంటున్నారు ప్రజలు. అక్రమ రేషన్ పై సివిల్ సప్లై అధికారులు, విజిలెన్స్ అధికారుల కంటితుడుపు చర్య పై పలు ఆరోపణలు మండలంలో వినిపిస్తున్నాయి. అక్రమరేషన్ బియ్యం దందాను అరికట్టడంలో సివిల్ సప్లై అధికారులు, పౌరసరఫరాల శాఖ నుంచి సరైన సహకారం లభించడం లేదని ప్రజల నుంచి వినిపిస్తున్న వాదన. ఇక్కడ అధికారులు ఎక్కడ కూడా తనిఖీ నిర్వహించిన దాఖలాలు ఎక్కడా మచ్చుకైనా కనిపించవు. మండలంలో అక్రమ రేషన్ బియ్యం పెద్ద ఎత్తున నల్ల బజార్కు తరలిస్తూ ఉన్న దాడులు జరగకపోవడం విశేషం. పేదల కడుపుకొట్టే ఇక్కడ వ్యాపారం చేసే ఓ డాన్ ఆగడాలు అంతా ఇంతా కాదని మండలంలో ఎక్కడ చూసినా ప్రజలు గుసగుసలాడుతున్నారు. ప్రజలు కట్టిన పన్నులతో జీతాలు తీసుకుంటూ ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాల్సిన అధికారులు మాఫియాకు అండదండలుగా ఉంటున్నారన్న



పలు ఆరోపణలు మండలంలో బహిరంగముగా చర్చ జరుగుతుంది. మండలంలో రేషన్ అక్రమ రవాణా కొనసాగించేందుకు అనేక అడ్డదారులు ఏర్పరచుకొని భారీ స్థాయిలు తిరువూరు చుట్టుపక్కల ఉన్న గ్రామాల నుండి బియ్యం తరలిస్తున్న పరిస్థితులు కనబడుతున్నాయి. వేల కోట్ల రూపాయలు ప్రభుత్వ ధనం కొల్లగొడుతూ మండలానికి చెందిన ఆ డాన్ కోట్లకు పడగలెత్తుతున్నాడని ప్రజలు అంటున్నారు. ఆయ గ్రామాల నుండి సేకరిస్తున్న అక్రమ బియ్యాన్ని 10 రూపాయలకు కొనుగోలు చేసి వాటిని రైస్ మిల్లర్లకు తరలించి పాలిష్ పట్టి తిరిగి వాటిని నాణ్యమైన సన్న బియ్యంగా ఆకర్షణీయమైన బ్యాగులలో మార్చి 30 నుంచి 50 రూపాయల వరకు అమ్ముతూ ప్రజలను మోసం చేస్తున్నారని చర్చ జోరుగా సాగుతుంది. రేషన్ బియ్యం దందాను అరికట్టకపోతే రానున్న రోజులలో నిరుపేదలకు బియ్యం అందని ద్రాక్ష గానే మిగులుతాయని పలువురు ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు అభిప్రాయపడుతూ డాన్ పై వెంటనే కఠినమైన చర్యలు తీసుకొని పేదల బియ్యాన్ని దారి మళ్లకుండా చూడాలని కోరుతున్నారు,



## సీనియర్ జర్నలిస్ట్ కేకే మూర్తి అకాల మరణం

**గుంటూరు, మేజర్ న్యూస్ :** సత్తెనపల్లి సీనియర్ జర్నలిస్ట్ కోట కృష్ణమూర్తి (66) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. మూర్తి అకాల మరణం చెందటం జర్నలిస్టు మిత్రులకు తీవ్ర విషాదం మిగిల్చింది. శనివారం ఉదయం మూర్తి భౌతిక కాయానికి సత్తెనపల్లిలో అంత్యక్రియలు జరగనున్నాయి. వీరికి భార్య ముగ్గురు ఆడపిల్లలు. కేకే మూర్తి గతంలో ఆంధ్రప్రభ, మహానగర్, కృష్ణ పత్రిక తదితర పత్రికలలో చాలాకాలం పని చేశారు. మూర్తి ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాలని ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ అధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావు, మారూరి పుల్లారెడ్డి, ఐజెయు మాజీ సభ్యులు మారూరి లింగారెడ్డి, జర్నలిస్ట్ మిత్రులు ఒక సంతాప ప్రకటనలో తెలిపారు.

# అమ్రిత సాయిలో ఓటు నమోదుపై అవగాహన





**కంచికచర్ల జనవరి 5 మేజర్ న్యూస్ :** అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఓటు నమోదు పై అవగాహనా కార్యక్రమం నిర్వహించి నట్లు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కె రామ్మోహన రావు తెలిపారు. శుక్రవారం కళాశాల ఎన్.యస్.యస్ యూనిట్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విశ్రాంత ఉద్యోగి సంఘం అధ్యక్షులు రామ మోహన రావు హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సం.లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియచేసారు. ఓటు హక్కు అనేది ఒక ప్రాథమిక హక్కు అని, స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి ఓటు కీలకం అన్నారు ఓటు ఒక వజ్రాయుధం అని, దీనితో ఒక దేశ భవిష్యత్తు ఆధారపడి వుంది అని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యమ్ శశిధర్ మాట్లాడుతూ యువత ఓటు చాలా కీలకం అని ప్రతి ఒక్కరు ఓటుకు నమోదు చేసుకోవటం తో పాటు, ఓటు హక్కుని విని యోగించుకోవాలని సూచించారు.

ఇంకా ఎవరైనా నమోదు చేసుకొని వారు ఉంటే సదస్సు లో వివరించిన విధంగా ఆన్ లైన్ లో అధికారిక వెబ్ సైట్ లో నమోదు కావాలని కోరారు. ఈ కార్యక్రమం లో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ చిరంజీవి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఓటు నమోదు ప్రక్రియను విద్యార్థులకు వివరించారు, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీదేవి, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఎంపి ఖాజా కుటుంబ సభ్యులకు జై భీమ్ శ్రీనివాస్ పరామర్శ

**నందిగామ, జనవరి 5, మేజర్ న్యూస్:** పట్టణంలోని స్టాఫ్ రిపోర్టర్ ,మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఎంఏ ఖాజా తల్లి జమీలున్ ఇటీవల మృతి చెందడంతో శుక్రవారం నందిగామ పట్టణంలోని వారి స్వగృహానికి తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అధ్యక్షులు జై భీమ్ శ్రీనివాస్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న ఖాజా సోదరుని కుమారుడు బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ అబ్దుల్ హాలీంని పరామర్శించిన ఉమా అతని ఆరోగ్యపరిస్థితులు తెలుసుకొని కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు.

## సమస్యలు వున్నా నేరుగా కలవండి



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** శుక్రవారం కలెక్టరేట్ లోని చాంబర్లో జిల్లా జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన గీతాంజలి శర్మ మీడియా తో మాట్లాడుతు ఏ సమస్యలు వున్నా నేరుగా నన్ను కలవండి అన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయంలోకి వచ్చే ప్రజల కు తక్షణమే పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమం లో కలెక్టరేట్ పరిపాలన అధికారి రాధిక పాల్గొన్నారు.

## జగనన్న లేఅవుట్ల అభివృద్ధి: ఎమ్మెల్యే నాని



**గుడివాడ, మేజర్ న్యూస్:**ప్రజల జీవన ప్రమాణాలకు అనుగుణంగా జగనన్న లేఅవుట్ల అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే కొడాలి నాని పేర్కొన్నారు. గుడ్లవల్లేరు జగనన్న హౌసింగ్ కాలనీలో జల్ జీవన్ మిషన్ నిధులు రూ. 1.64 కోట్లతో నిధులతో చేపట్టనున్న రక్షిత మంచినీటి సరఫరా పథకం పనులకు ఎమ్మెల్యే శుక్రవారం శంఖుస్థాపన చేశారు. పైప్ లైన్ ద్వారా ఇంటింటికీ కుళాయి ఏర్పాటుచేసి నీటి ఇస్తామన్నారు. అనంతరం జడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక, ప్రజా ప్రతినిధులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించిన ఎమ్మెల్యే నాని, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ స్వర్గీయ వైయస్సార్ హయంలో సేకరించిన 30 ఎకరాల భూముల్లో 940 మంది లబ్ధిదారులకు ఫ్లాట్లు ఇచ్చామన్నారు. ప్రజల అవసరాలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సహకారంతో నాలుగు ఎకరాలు సేకరించి మరో 160 మంది లబ్ధిదారులకు ఫ్లాట్లు ఇచ్చామన్నారు. ఇప్పటికే 550 మందికి పైగా లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్నారన్నారు. త్రాగునీటి వసతితో పాటుగా కాలనీలో ప్రజల జీవనానికి ఇబ్బందులే కుండా అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని, రోడ్ల అభివృద్ధికి 15 లక్షల నిధులు ఇప్పటికే మంజూరు చేశామన్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీపీ సురేష్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలేటి చంటి, ఉప్పాల రాము, గుడ్లవల్లేరు మండల వైసీపీ బూత్ కమిటీల ఇన్చార్జ్ కోటప్రోలు నాగు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పెన్నేరు ప్రభాకర్, దుగ్గిరాల శేషుబాబు,సోషల్ మీడియా కన్వీనర్ గుదే రవి, ఆంజనేయులు,చెబత్తిన నాని,మేకల అనిల్, స్థానిక కాలనీ నివాసితులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



## కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

**జగ్గయ్యపేట జనవరి 5 మేజర్ న్యూస్ :** పట్టణంలోని మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె శుక్రవారం 11వ రోజుకు చేరింది.కార్మికులు, సిఐటియుసి, ఏఐటియుసి ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మున్సిపల్ కార్మికుల వేతనాన్ని 26000 వరకు పెంచాలని, మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సి ఐ టి యు సి, ఏ ఐ టి యు సి నాయకులు కోట కృష్ణ, రావెళ్ళ శేషు, ఏ. శివాజీ, పోతుపాక వెంకటేశ్వర్లు, మున్సిపల్ కార్మికులు ఎలకమ్మ, మార్తమ్మ, సమాధానం, వి భాస్కర్, వి.వెంకట్ నారాయణ, ప్రసాద్, వాసు, తిరుపతమ్మ తదితర కార్మికులు పాల్గొన్నారు.

## మట్టి ఖర్చుల నిమిత్తం 5 వేల ఆర్థికసాయం



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** గూడూరు మండలం మల్లవోలు గ్రామానికి చెందిన బొర్రా వెంకమ్మ అనే మహిళ చనిపోయింది. ఈ కుటుంబం చాలా పేద కుటుంబం ఈమె మట్టి ఖర్చుల నిమిత్తం మల్లవోలుకు చెందిన హెల్పింగ్ హాండ్స్ అనే స్వచ్ఛంద సంస్థ రూ.5000లు సహాయం చేశారు. ఈ సందర్భంగా పేదవారికి ఏ కష్టం వచ్చినా ఆదుకుంటున్న హెల్పింగ్ హాండ్స్ ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పదవల మోహన్ త్రినాథ్, మట్ట శ్రీను తదితర హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బిగిన్ ఆఫ్ దా గోల్డెన్ ఏర్పాటు



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** స్థానిక సన్ స్టార్ స్కూల్లో ఒక అద్భుత కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ పిల్లలకు తెలుగు, హిందీ భాషలను నేర్పించుట కొరకు తయారు చేసిన ద్విభాషాపుస్తక నేస్తం అనే పుస్తకము శుక్రవారం బందరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ వాణి చేతుల మీదుగా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. గ్లోబల్ స్టార్స్ ని తయారు చేయాలని సంకల్పంతో మొదలైన ఈ స్కూలు ఆదిశగా ఇంకొక అడుగు ముందుకు వేసింది. ప్రస్తుత సమాజంలో పిల్లలు ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో ముఖ్యంగా లిజనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ వంటి అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించి,పుస్తకంలో మరింత స్పష్టంగా, పిల్లలకు అర్థమయ్యే విధంగా పొందుపరచడంతో పాటు వాటి మీద సూపర్ కమాండ్ వచ్చే విధంగా పుస్తకాన్ని తయారు చేశారు. సన్ స్టార్ స్కూల్ పిల్లలకి ఈ పుస్తకాన్ని ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో బందరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ వాణి, స్టార్ విద్యా సంస్థల డైరెక్టర్ శ్రీరామ్, పుస్తక రచయిత కలిదిండి కృష్ణవేణి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పేర్నేటి గంగాధర రావు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గుడివాడ రైల్వే స్టేషన్‌కు ఐఎస్ఓ 14001: 2015 గుర్తింపు



**గుడివాడ, మేజర్ న్యూస్:** గుడివాడ రైల్వే స్టేషన్ కు ఐఎస్ఓ 14001 : 2015 గుర్తింపు దక్కింది. సంబంధించి సూపర్ వైజర్ లు, స్టాఫ్ కు ఐఎస్ఓ 14001:2015 రైల్వే డివిజన్ మేనేజర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ అవార్డు ప్రయాణికుల భద్రత విషయంలోనూ, అవసరాల విషయంలోనూ, రక్షణ విషయంలోనూ, పరిశుభ్రత విషయంలోనూ, అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను ఈ పురస్కారం లభించిందని మేనేజర్ తెలిపారు. ఈ అవార్డు గుడివాడ రైల్వే స్టేషన్ లో పనిచేస్తున్న అన్ని సెక్షన్స్ సూపర్వైజర్ల ద్వారా వారి సహకారం వల్ల లభించిందన్నారు. వీరందరికీ ఎస్ఎంఆర్ రమేష్ బాబు అభినందనలు తెలియజేశారు.

# మీ పిల్లల్లో టాలెంట్ ఉందా? వెంటనే వీడియో తీసి పోస్ట్ చేయండి..

## జీ తెలుగు డ్రామా జూనియర్స్ సీజన్ 7 ఆడిషన్స్ ప్రారంభం!

**విజయవాడ, డిసెంబర్ 5, మేజర్ న్యూస్ :** తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు సరికొత్త కార్యక్రమాలు అందించడంలో ముందుండే జీ తెలుగు ప్రతిభావంతులను ప్రోత్సహించడంలోనూ తన పాత్ర పోషిస్తుంది. జీ తెలుగు ప్రతిష్టాత్మక కార్యక్రమం డ్రామా జూనియర్స్ సరికొత్త సీజన్తో మీ ముందుకు వచ్చేస్తోంది. ఈసారి తెలుగు రాష్ట్రాల్లోని పిల్లలతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన పిల్లలకు అవకాశం కల్పిస్తోంది. చిన్న పిల్లల్లో నటనా ప్రతిభను వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో డ్రామా జూనియర్స్ సీజన్ 7 ప్రారంభించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. ఇప్పటికే విజయవంతంగా 6 సీజన్స్ ను పూర్తి చేసుకున్న డ్రామా జూనియర్స్ మరో సీజన్తో తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. 3 నుంచి 13 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఇదే సువర్ణావకాశం. మీ పిల్లల్లోని




ప్రతిభను గుర్తించి వారి భవిష్యత్తుకు బాటలు వేసేందుకు జీ తెలుగు మీకు అవకాశం అందిస్తోంది. మీ పిల్లలకు డ్యాన్స్, పాటలు పాడటం, నటన, మ్యాజిక్ (ట్రిక్స్), మార్షల్ ఆర్ట్స్ తో పాటు మరేదైనా టాలెంట్ ఉన్నా ఇదే చక్కని అవకాశం. ప్రపంచవ్యాప్తంగా వివిధ నేపథ్యాలు, జీవనశైలిలో ఎదుగుతున్న ప్రతిభావంతమైన పిల్లలను గుర్తించే లక్ష్యంతో జీ తెలుగు ఛానల్ ఈ అవకాశాన్ని అందిస్తోంది. జీ తెలుగు పాపులర్ షో డ్రామా జూనియర్స్ సీజన్ 7 ఆడిషన్స్ తో మునుపెన్నడూ లేని విధంగా బిగ్ స్టేజ్ పై మెరిసే ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే మీరు చేయాల్సిందేంటంటే.. పిల్లల్లోని టాలెంట్ని ప్రతిబింబించేలా 2 నిమిషాల నిడివి గల వీడియోను DramaJuniorsS7Auditions. Zee5.com లో పోస్ట్ చేయాలి. లేదా 9100054301 dramajuniorsseason7@gmail.com 5 కూడా పంపించవచ్చు. లిప్ సింక్ ఉన్న వీడియోలు పరిగణనలోకి తీసుకోబడవని గమనించాలి.

## పైడమ్మ అమ్మవారికి సారే, ప్రసాదాల సమర్పణ



**పెడన మేజర్ న్యూస్ :** పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ పైడమ అమ్మవారి జాతను పురస్కరించుకొని పెడన నియోజకవర్గ జనసేన పార్టీ తరపు నుండి సారే, ప్రసాదాలు సమర్పణ జరిగిందని నియోజవర్గ జనసేన నాయకులు ఎస్ వి బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆడపడుచులతో కలిసి అమ్మవారికి చీర, పసుపు, కుంకుమ, గాజులు, ప్రసాదాలు, నైవేద్యాలు, (సారే) సమర్పించారు. ఈ సందర్భంగా ఒక ప్రకటనలో మాట్లాడుతూ ప్రతి సంవత్సరము మార్గశిర శుద్ధ పౌర్ణమి రోజున ప్రారంభమై 11 రోజులు జరిగే జాతర రంగ రంగ వైభవంగా జరుగుతుందన్నారు. కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారు తల్లి అని ప్రాంత వాసులు నమ్మకం అని తెలిపారు. ఈ కార్యక్రమం బత్తిన హరిరామ్, జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తన, వీర మహిళా కోఆర్డినేటర్ రావి సౌజన్య, కౌన్సిలర్ మట్ట శివ పావని కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి, చింతల లక్ష్మి కుమారి, పుప్పాల సుమలత, జనసేన పార్టీ సీనియర్ నాయకులు సింగలూరి శాంతి ప్రసాద్, కొరియర్ శ్రీనివాస్, పాండమనేని శ్రీనివాస్, కనపర్తి వెంకన్న, ముదినేని కొండ, ఊచ వెంకయ్య చీరల నవీన్ కృష్ణ, గల్లా హరీష్, ముదినేని రామకృష్ణ, శ్రీమ్ సంతోష్, పుప్పాల సూర్యనారాయణ పుప్పాల పాండురంగారావు పుప్పాల సుబ్బారావు, జెన్యావుల నాగబాబు, కూనపరెడ్డి రంగయ్య నాయుడు, పత్తిపాటి జయకృష్ణ, కమ్మిలి తేజ, ఎలవర్తి ఆంజనేయులు, ఆదిశేషు, సీతారాం, నందకిషోర్, గౌరిశెట్టి నాగరాజు, జోగి నాయుడు, పోతన గంగాధర్, పామర్తి వీర ప్రకాష్, అబ్దుల్ నజీర్, పినిశెట్టి రాజు, దుర్గ, గరికిపాటి ప్రసాద్, సాయి, గడ్డం రాము,, పెద్ద జనసైనికులు పాల్గొన్నారు.

## తంబి తిరునాల్లలో పాల్గొనున్న కృష్ణాజిల్లా కలెక్టర్



**గన్నవరం, జనవరి 5, మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా కలెక్టర్ టి. రాజా బాబు 13 జనవరి 2024 న బ్రదర్ జోసఫ్ తంబి మహోత్సవాలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. జోసెఫ్ తంబి పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ పాలడుగు జోసఫ్ పెద్దవుటపల్లి విచారణ గురువులు ఫాదర్ అభిలాష్ గోపు కలెక్టర్ ని మర్యాద పూర్వకంగా కలిశారు. తంబి పండుగకు ఆహ్వాన పత్రాన్ని ఇచ్చిన సందర్భంగా, కలెక్టర్ తంబి తిరునాల్లలో 13 జనవరి ఉదయం 10 గంటలకు ఉత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు..

## పెండ్యాలలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్



**కంచికచర్ల జనవరి 5 మేజర్ న్యూస్ :** మండలంలోని పెండ్యాల గ్రామ మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ -2 క్యాంప్ ను నందిగామ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు శుక్రవారం సందర్శించారు వైద్యులతో మాట్లాడి అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర ప్రజల ఆరోగ్యం బాగుండాలన్న లక్ష్యంతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా చర్యలు తీసు కుంటున్నారని తెలిపారు. విద్యా, వైద్య రంగాలకు సంబంధించి ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ కనబరచడటమే కాకుండా ఏటా వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. పెరిగిన జనాభా, వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామంలో



వైయస్సార్ హెల్త్ సెంటర్లను నిర్మించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలన్నదే లక్ష్యమన్నారు. తన తండ్రి ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత విస్తరించారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడత విజయవంతం కావడం ప్రజల నుంచి మంచి స్పందన లభించడంతో రెండో విడతను ప్రారంభించారని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ మేలు జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం








**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** అర్హులైన పేదలందరికీ మేలు జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ గా నవరత్నాలు ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమం కాంచనంగా ప్రారంభించి 68,990 మంది లబ్ధిదారులకు 97.7 6 కోట్ల రూపాయలను బటన్ నొక్కి వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ఈ కార్యక్రమంలో నగరంలోని కలెక్టరేట్ వీసీ హాల్ నుండి జిల్లా కలెక్టర్ మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, ఉప మేయర్ విజయలక్ష్మి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్షాద్ నజరానా తో కలిసి పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం నవరత్నాలు పేరుతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఎవరైనా అర్హులై ఉండి పొరపాటున గాని, సరైన పత్రాలు గాని సమయానికి లేక గానీ లేక ఏదేని కారణం చేత ఏదైనా పథకం అందకపోతే అటువంటివారు ప్రతి సంవత్సరము 6 నెలలకు ఒకసారి జూన్, డిసెంబర్ నెలల్లోగా తిరిగి దరఖాస్తు చేసుకుంటే పరిశీలన జరిపి పథకాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అర్హత కలిగి వుండి ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకం లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. అర్హులైన వారందరికీ సంతృప్త స్థాయిలో ప్రభుత్వ పథకాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆ ప్రకారం జిల్లాలో ఈబీసీ నేస్తం, జగనన్న అమ్మఒడి, జగనన్న చేదోడు, వైయస్సార్ కళ్యాణమస్తు-షాదీ తోఫా, వైయస్సార్ కాపు నేస్తం, వైఎస్ఆర్ మత్స్యకార భరోసా, వైయస్సార్ నేతన్న నేస్తం, వైయస్సార్ వాహన మిత్ర పథకాల కింద 1978 మంది లబ్ధిదారులకు 2.93 కోట్ల రూపాయలను కొత్తగా ద్వైవార్షిక మంజూరు చేయడం జరిగిందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రజా ప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు వివిధ పథకాల కింద 8 రకాల నమూనా మెగా చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం డి ఆర్ డి ఏ ఆధ్వర్యంలో జగనన్న పింఛను కానుక పై రూపొందించిన గోడ పత్రాలను జిల్లా కలెక్టర్ ప్రజా ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి పిఎస్ఆర్ ప్రసాద్ బీసీ కార్పొరేషన్ ఈడీ కె రాజేంద్ర బాబు, మత్స్యశాఖ జేడీ ఏ చంద్రశేఖర్, చేనేత జౌళి శాఖ డివో డి శ్రీనివాసరావు తదితర అధికారులు, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# 22వ డివిజన్‌లో వై ఏపీ నీడ్స్ వైఎస్ జగన్





**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** స్థానిక కృష్ణలంక 22వ డివిజన్ లోని 109 వార్డు సచివాలయం పరిధిలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ వైఎస్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం లో వైస్సార్సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త దేవినేని అవినాష్, వీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, క్లస్టర్ ఇచ్చార్జ్ లు,పాల్గొని కోతమిషన్ రోడ్ లోని నూతనంగా నిర్మించిన వైస్సార్సీపీ జెండా ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ లోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎక్కువ మొత్తంలో పింఛన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ



**గన్నవరం, జనవరి 5, మేజర్ న్యూస్ :** ఉంగుటూరు మండలములోని 16 గ్రామ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ జనవరి మాసం (నూతన సం.) కానుకగా వృద్దాప్య, వితంతు, ఒంటరి మహిళ, చేనేత, గీత కార్మికులు, చర్మ కారులు, మత్స్యకారులు, డప్పు కళాకారులు మొదలగు అన్ని పింఛను 2750 నుండి 3000 కు పెంచిన లబ్దిదారులకు రూ.3000/- పెంచిన సామజిక భద్రత ఫించన్లు ( వై.ఎస్.ఆర్ ఫించను కానుక - 8255 ఫించన్లు ), అలాగే మండలమునకు కొత్తగా మంజూరు కాబడిన 97 ఫించన్లు ఆయా గ్రామ సర్పంచ్ లు, ఎం.పి,టి.సి లు ఇతర ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు సమక్షంలో పండగ వాతావరణంలో లబ్దిదారులకు అందచేయుట జరుగుతుంది. ఈ కార్యక్రమంలోలబ్దిదారుల నుండి అనూహ్య స్పందన లభించింది. శుక్రవారం వెల్దిపాడు గ్రామ సచివాలయంలో 16 మందికి నూతనంగా మంజూరు కాబడిన ఫించన్లు లబ్దిదారులకు లబ్దిసొమ్ము అందించడం జరిగిందని, సామాజిక పింఛన్లు అవ్వాతాతల ఆర్థిక అవసరాలకు ఎంతో ఉపయోగపడుతుంది అని, కొత్తగా మంజూరు కాబడిన లబ్దిదారులు సంతోషం వ్యక్తం చేసి ముఖ్యమంత్రి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియ చేసారు అని ఎం.పి.డి.ఓ జి.ఎస్.వి శేషగిరిరావు తెల్పినారు. ఈ కార్యక్రమంలో వెల్దిపాడు గ్రామ సర్పంచ్ లాం నాగేశ్వరరావు, వెన్నూతల గ్రామ సర్పంచ్ టి రామమోహనరావు, నాగవరప్పాడు గ్రామ సర్పంచ్ షేక్ పెద్ద నాగూర్, తుట్టగుంట గ్రామ సర్పంచ్ బి.రామకృష్ణ రెడ్డి, తరిగొప్పుల ఎం.పి.టి.సి సభ్యులు నటరాజ్, వార్డు సభ్యులు వై.ఎస్.ఆర్.సి.పి మండల పార్టీ కన్వీనర్ జి.బాలాస్వామి, మండల సచివాలయ కన్వీనర్ ఆదినారాయణ రెడ్డి (నాని), గ్రామ పెద్దలు జి.సిమయా, బి.కిరణ్, ప్రజలు, వాలంటీర్లు, డ్వాక్రా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.



## ఆరోగ్య విద్య మీడియా అధికారుల అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ఆరోగ్య విద్య, మీడియా అధికారుల అసోసియేషన్ వారు రూపొందించిన 2024ఆంగ్ల క్యాలెండర్ను డాక్టర్ జి. గీతాబాయి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారినీ తమ కార్యాలయంలో నూతనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ఆరోగ్య విద్య, మీడియా అధికారులు, ఆరోగ్య విద్యా బోధకులు, ఆరోగ్య విద్యా విస్తరణాధికారులు తమ పరిధిలో జరుగుచున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలను, వాటి అమలు తీరును ఎప్పటికప్పుడు మీడియా అధికారులు ద్వారా పత్రికలలో ప్రచురితమైటట్లు, ప్రజలలో సరియైన అవగాహన కలిగేటట్లు చేయుటలో వీరు ప్రధాన భూమికను పోషిస్తున్నారని తెలియజేశారు. ప్రజారోగ్యమును కాపాడుట కొరకు పత్రికలలో ప్రచురితమైనటువంటి వివిధ ఆరోగ్య కార్యక్రమాలు అన్ని చాలా అభినందనీయమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియాధికారి బి.రామా రావు, హెచ్ఈఓ బి. శివ సాంబిరెడ్డి, ఆరోగ్య విద్యా బోధకులు బి రాజేంద్ర కుమార్, కార్యాలయ పర్యవేక్షకులు శివ కుమార్, యం. రత్న రాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పౌర సేవా కేంద్రాలుగా విలసిల్లుతున్న సచివాలయాలు



## ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి క్యాలెండర్ ఆవిష్కరించిన అప్పిరెడ్డి

**గుంటూరు, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ సృష్టించిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ అత్యుత్తమ పనితీరుతో దేశానికే ఆదర్శనీయంగా నిలిచిందని ప్రభుత్వ విప్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి వెల్లడించారు. అనేక పథకాల ఫలాలను నేరుగా ప్రజల ముంగిళ్ళకే తెచ్చి అందిస్తూ పౌర సేవా కేంద్రాలుగా సచివాలయాలు విలసిల్లుతున్నాయని ఆయన కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కమిటీ ప్రత్యేకంగా రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి ఆవిష్కరించారు. బృందావన్ గార్డెన్స్‌లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ సచివాలయాల వ్యవస్థకు అంకురార్పణ చేసినట్లు చెప్పారు. ఫలితంగా అన్ని రకాల సేవలు ప్రతి గడపలోకి వచ్చి ప్రజలకు నేరుగా అందుతున్నట్లు తెలిపారు. గతంలో ఏ చిన్న పని కావాలన్నా ఆయా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ లబ్ధిదారులు చెప్పులరిగేలా ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని ఆయన గుర్తు చేశారు. లేకుంటే చంద్రబాబు వేసిన జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బతకాల్సి వచ్చేదన్నారు. అంతెందుకు గత ప్రభుత్వ హయాంలో చాలీచాలని ఫించన్ కోసం మన అవ్వాతాతలు క్యూలో గంటల తరబడి వేచి ఉన్న వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గమనంలో ఉంచుకోవాలని సూచించారు. సచివాలయాల ఏర్పాటు తర్వాత ఇప్పుడా దుస్థితి సమూలంగా తుడిచిపెట్టుకు పోయిందని ఆయన తెలిపారు. ఎక్కడికీ వెళ్ళే అవసరం లేకుండానే.. ఎవరినీ దేహీ అని యాచించకుండానే.. ప్రతి నెలా ఒకటవ తేదీనే.. ఠంచన్‌గా ఫించన్ వచ్చి చేరుతుందని ఆయన వివరించారు. కులం చూడకుండా.. మతం చూడకుండా.. ప్రాంతాలు, పార్టీల పట్టింపే లేకుండా.. కేవలం అర్హతే ప్రామాణికంగా రాష్ట్రంలోని పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే సీఎం వైయస్ జగన్ అంతిమ లక్ష్యమని లేళ్ళ అప్పిరెడ్డి ప్రకటించారు. అర్హత కలిగి ఉండి లబ్ధి పొందని వారు ఒక్కరు కూడా ఉండకూడదన్నదే ఆయన ఉద్దేశ్యమని తెలిపారు. అందులో భాగంగానే 2023 ఆగస్టు నుండి డిసెంబర్ వరకు అమలైన పథకాలకు అర్హత ఉండి లబ్ధి పొందని వారికి సీఎం మరో అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఈ క్రమంలో కొత్తగా అర్హత సాధించిన 68,990 మందికి రూ.97.76 కోట్ల రూపాయలను బటన్ నొక్కడం ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఇలాంటి అన్ని అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి క్షేత్ర స్థాయిలో అవి సవ్యంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత మీపైనే ఉందని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నేతలకు ఆయన సూచించారు. ముఖ్యమంత్రి ఆలోచనా విధానానికి అనుగుణంగా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని లేళ్ళ అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, మిర్చియార్డు వైస్ చైర్మన్ షేక్ సుభాని, డైరెక్టర్లు కొత్తపేట సతీష్, ప్రభు, సంఘం రాష్ట్ర నాయకులు బత్తుల అంకమ్మరావు, బి.ఆర్.కిషోర్, గుంటూరు జిల్లా నాయకులు తాడిబోయిన రాజేష్, అనిల్ రాథోడ్, తోట మహేష్, గోలి ధనలక్ష్మి, జాన్ బెన్హర్, జాన్ డేనియల్, చల్లా శ్రీనివాస్, హరికృష్ణ, ఉదయ్, చాణిక్య, ప్రకాష్, బుల్లయ్య, శ్రీనివాస్, శిరీష, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

# మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూమ్‌లో మైండ్ డైమండ్ షో ప్రారంభం




**గుంటూరు,మేజర్ న్యూస్ :** గుంటూరు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో మైన్ డైమండ్స్ షోని ప్రారంభించారు. లక్ష్మీపురం మలబార్ షోరూమ్‌లో ఎర్పాటు చేసిన షోని డాక్టర్ పి.ఎస్.ఎస్. హరిత ఎండీ., డీఎం., వ్యాపారవేత్త రమణారావు ప్రారంభించారు... మైన డైమండ్స్ షో ను ప్రారంభించిన డాక్టర్ హరిత,వ్యాపారవేత్త రమణారావు మాట్లాడుతూ రోజు ధరించే బంగాలరు ఆభరణాలు,లైట్ వెయిట్ ఆభరణాలు,పురుషుల ఆభరణాలు, ప్లాటినం ఆభరణాలు అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. ఈనెల 5వ తేదీ నుండి 9 తేది వరకు మైన్ డైమండ్స్ ప్రదర్శన జరగనున్నట్టు చెప్పారు. పాత డైమండ్ ఆభరణాల మార్పిడి పై వంద శాతం విలువ,కొత్త డైమండ్ కొనుగోలు పై ఇరవై ఐదు శాతం తగ్గింపు లభిస్తుందన్నారు. నాణ్యమైన ఆభరణాలను అందించడం తో పాటు ఉచిత భీమా బై బాక్ వంటి ఆఫర్లను అందిస్తున్నట్టు తెలిపారు. ధ్రువీకరించిన, బాధ్యతాయుత మూలాల నుండి సేకరించిన వజ్రాలను ఉపయోగించి వజ్రాభరణాలను రూపొందించడంలో నమ్మకం పాద దర్శకత, నాణ్యతకు మల్బార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కట్టుబడి ఉంది 28 దశల్లో నాణ్యత పరీక్షలను నిర్వహించడం ద్వారా అత్యుత్తమ నాణ్యత గల వజ్రాలను అందిస్తుంది 28 పాయింట్లు నాణ్యత తనిఖీ నిర్వహించిన తర్వాత ప్రతి ఆభరణం యొక్క స్వచ్ఛతను, అంతర్జాతీయ ప్రమాణాలను నిర్ధారిస్తూ జిఐఎ, ఐజిఐ ధృవ పత్రాలను పొందుతుంది మలబార్ జీవితకాల నిర్వహణ ఏడాది పాటు ఉచిత భీమా, బైబ్యాక్ హామీ వంటి విలువ ఆధారిత సేవలను అందిస్తుంది ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంచడమే ధ్యేయంగా ఆభరణం యొక్క మొత్తం బరువు రాళ్ల బరువు, తయారీ వ్యయాన్ని సూచించే ధరల పట్టిక ప్రతి ఆభరణం తో పాటు ఉంటుంది... కార్యక్రమంలో షోరూమ్ హెడ్ నదీర్,మార్కెటింగ్ మేనేజర్ గోపి కిరణ్ పాల్గొన్నారు.

# జగన్‌రెడ్డి పాలనలో సంక్షోభంలో రాష్ట్రం

### అరాచక, అసమర్ధ పాలనతో ఆంధ్రప్రదేశ్ అధోగతి

### ప్రజా వ్యతిరేకతను బడుగు, బలహీన ఎమ్మెల్యేలకు అంటగట్టి బలిపశువుల్ని చేస్తున్న వైనం

### మన్నవ మోహనకృష్ణ



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** తన చేతగానీతనంతో ఏపీని జగన్‌రెడ్డి సంక్షోభాంధ్రప్రదేశ్‌గా మార్చివేశారని, ఫలితంగా సొంత పార్టీ ఎమ్మెల్యేలతో పాటు అన్ని వర్గాల ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ నేత మన్నవ మోహనకృష్ణ శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేకతను బడుగు, బలహీన వర్గాలకు చెందిన సొంత పార్టీ ఎమ్మెల్యేలకు అంటగట్టి వారి బలిపశువుల్ని చేయడమే కాకుండా... పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయమని కోరుతున్న అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికుల పట్ల కర్కశంగా వ్యవహరించడం దుర్మార్గమని మోహనకృష్ణ మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం గుంటూరులోని తన కార్యాలయంలోని నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తన రాజకీయ ప్రస్తానం మొదలైన దగ్గర నుంచి ప్రజల్ని, రాజకీయ నాయకుల్ని అవసరాలకు వాడుకుని వదిలేయడం... అధికారం కోసం అన్నిరకాలుగా గడ్డికరవడం జగన్‌రెడ్డి నైజమని ధ్వజమెత్తారు. తన అస్తిత్వాన్ని కాపాడుకొనేందుకు... రాష్ట్రాన్ని ఎవరు బాగు చెయ్యలేనంతగా నా శనం చేసిన జగన్మోహన్‌రెడ్డి... వచ్చే ఎన్నికల్లో అధికారాన్ని నిలబెట్టుకోవ డానికి సిట్టింగ్ ఎమ్మెల్యేలు అయిన బడుగు, బలహీన వర్గాల వారిని బలిపశువులను చేస్తున్నారని అన్నారు. దాదాపు నెల రోజులుగా వివిధ వర్గాల ప్రజలు, అంగన్వాడీలు మున్సిపల్ కార్మికులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా.. ఏం పట్టనట్లు బాధ్యత లేకుండా జగన్ ప్రభుత్వం వ్యవహరించడం అత్యంత దుర్మార్గమన్నారు. బాధ్యత వున్న ఏ ప్రభుత్వం ఇంత దారుణంగా వ్యవహరించదని, జగన్ పాలనలో అన్ని వర్గాలు రోడ్లపై ఆందోళనలు చెయ్యడంతో ఆంధ్రప్రదేశ్ సంక్షోభాంధ్రప్రదేశ్‌గా మారిందన్నారు. అంగన్వాడీలు, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు, వివిధ తరగతులకు చెందిన చిరుద్యోగులు, కార్మికులు ఆందోళన చేస్తున్నారని, ఆశా వర్కర్లు, విద్యుత్, కెజిబివి, పంచాయతీ రాజ్ ఉద్యోగులు ఈ జాబితాలో ఉన్నారని అన్నారు. చివరకు వలంటీర్లు ఇప్పుడు ప్రభుత్వంపై తిరుగుబావుటా ఎగురవేస్తూ సమ్మె జెండా ఎత్తడం ముమ్మాటికి జగన్ రెడ్డి చేతగానీతనమేనని మోహనకృష్ణ పేర్కొన్నారు.




## వృత్తి విద్య కోర్సులే భవిష్యత్తు సోపానాలు

**ముప్పాళ్ళ, మేజర్ న్యూస్:** వృత్తివిద్య కోర్సులే భవిష్యత్తుకు ఉపాధి సోపానాలు అని ముప్పాళ్ళ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. నాగేంద్రమ్మ తెలిపారు. మండలంలోని ముప్పాళ్ళ జడ్పీ ఉన్నత పాఠశాలలో 2023 - 24 విద్యా సంవత్సరానికి సంబంధించి వృత్తి విద్యలో భాగంగా 9, 10 వ తరగతి విద్యార్థులు లెర్నెట్ స్కిల్స్ వారి ఆధ్వర్యంలో ధూళిపాళ్లలోని రాయని స్పెంటెక్స్ మిల్లుకు ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మిల్లులో దారం తయారీ అలాగే సెన్సార్ బేస్డ్ మిషన్స్ సోలార్ ప్యానల్స్ ఉపయోగించి ఎలక్ట్రిసిటీ జనరేషన్ గురించి నిపుణులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే మిల్లు జనరల్ మేనేజర్ అయిన ఆనంద్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో వృత్తి విద్యా టీచర్ జి. దయామణి, ఉపాధ్యాయులు నాగమల్లేశ్వరరావు, శిరీష, రజిని పాల్గొన్నారు.

## నిరుపయోగంగా ఉన్న కమ్యూనిటి భవనాన్ని కూల్చండి




**తెనాలిరూరల్,మేజర్ న్యూస్:** దళితవాడలో స్మశాన వాటిక ఎదురు 15 సెంట్ల స్థలాన్ని,మరణించిన బంధువుల స్నానాల కోసం బావిని,పూర్వీకులు కేటాయించారని అది స్థానికులకు సమాచారం లేకుండా వాటర్ ట్యాంక్ నిర్మించడం ఎంతవరకు సమంజసమని గ్రామస్థుడు ఉన్నం లక్ష్మయ్య రూరల్ మండలం కొలకలూరు గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం జరిగిన గ్రామ సభలో వాపోయారు. అదేవిధంగా దళితవాడలో నిరుపయోగంగా ఉన్న కమ్యూనిటీ భవనాన్ని కూల్చివేసి నివేశ స్థలాన్ని మాకు అప్పగించాలని గ్రామ సభలో అధికారులను కోరారు. అదేవిధంగా పంచాయతీలో ఉన్న ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల వివరాలను తెలియజేయాలని కోరారు. దళితవాడలో పైప్ లైన్ల కోసం పగులకొట్టిన రోడ్లను పూడ్చాలని,అత్యాల వారి వీధికి సీసి రోడ్డు శంఖుస్థాపన చేసి ఏళ్ళు గడుస్తున్న రోడ్డు నిర్మాణం జరుగలేదని మాజీ పంచాయతీ వార్డు మెంబర్ ఉన్నం రాంబాబు అధికారులను అడిగారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు నూతన భవన శంకుస్థాపన



**పొన్నూరు మేజర్ న్యూస్ :** రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు నూతన భవనానికి శంకుస్థాపన శుక్రవారం జరిగింది. నూతన భవన నిర్మాణానికి స్థల దాత అయినంపూడి శ్రీనివాసరావు శివకుమారి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక జిబీసీ రోడ్డులోని చాణక్య స్కూలు ప్రాంగణంలో రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు నూతన భవన నిర్మాణానికి జరిగిన శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ రోటరీ క్లబ్ తో తనకున్న సానిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. రోటరీ ఐ ఐ ఐ క్లబ్ చేస్తున్న సేవలు అమోఘం అన్నారు. నూతన భవన నిర్మాణం ద్వారా పొన్నూరు పరిసర ప్రాంతాలలో మరిన్ని సేవా కార్యక్రమాలు రోటరీ క్లబ్ నిర్వహిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ప్రపంచవ్యాప్తంగా సేవలందించడంలో ప్రథమ స్థానంలో ఉన్నదన్నారు. పొన్నూరు రోటరీ క్లబ్ పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు విద్య వైద్యం వ్యవసాయం తదితర రంగాలలో అనేక సేవలందిస్తుందన్నారు. రానున్న కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాల ద్వారా రోటరీ క్లబ్ మన్ననలు పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బండారుపల్లి శ్రీనివాసరావు,బోడపాటి రామారావు, సభ్యులు కొసరాజు సత్యనారాయణ, పాములపాటి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ రూ.3 వేలు ఇస్తున్న ఘనత సీఎం జగన్ దే...



**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** పింఛన్ సొమ్ము క్రమంగా 3000 పెంచి అందచేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దే అని పత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ అన్నారు. గుంటూరు శివారు తురకపాలెం డబ్బురి కళ్యాణ మండపంలో వైయస్సార్ పింఛన్ సంబరాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి కిరణ్ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మొత్తం 11 పంచాయతీల పరిధిలో 4756 మందికి పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. వారిలో 77 మందికి కొత్తగా అందించడం విశేషం. కార్యక్రమంలో రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, జెడ్పిటిసి తుమ్మల సుబ్బారావు, మిర్చి యార్డ్ డైరెక్టర్ ఇంద్ర, మండల ఉపాధ్యక్షురాలు సుజాత, సర్పంచ్ డబ్బురి సూర్యప్రకాశరావు, ఎంపీడీవో ఆదినారాయణరావు, ఈవోపి ఆర్ డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కొలకలూరులో గ్రామ సభ నిర్వహణ



**తెనాలి రూరల్, మేజర్ న్యూస్:** రూరల్ మండలం కొలకలూరు గ్రామ పంచాయతీ ఆవరణలో పం చాయతీ కార్యదర్శి (ఎఫ్ఏ సి) సూరపనేని కల్పన అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు పోలీస్, రెవిన్యూ, పంచాయతీ, సచివాలయం,ఆరోగ్య,వ్యవసాయ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. తొలుత గ్రామ పంచాయతీ ఎజెండాను పంచాయతీ కార్యదర్శి చదివి వినిపించారు.ముఖ్యంగా చెత్త సేకరణ చేసే స్థలం లేకపోవడంతో గ్రామంలో అనూకూలమైన స్థలాన్ని ఎస్ డబ్ల్యూ షెడ్డు కోసం పరిశీలనలో ఉంటే తెలియజేయగలరని ప్రజలను కోరారు.రైతులకు వ్యవసాయపరంగా సలహాలు,సూచనలు విఏఏ నాగరాజు వివరించి చెప్పారు. గృహ నిర్మాణాలు తదితర అంశాలపై వంశీ,ఆరోగ్య పరంగా ఏఎన్ఎం గజలక్ష్మీ సమస్యలు ఏమైన ఉంటే దృష్టికి తేవాలని తెలిపారు. జనాభా ప్రాధిపతికన హెల్త్ క్లినిక్స్ నాలుగు ఉండాలని ప్రస్తుతం రెండే ఉన్నాయని ఆరోగ్య సిబ్బందిని ఉన్నం లక్ష్మయ్య ప్రశ్నించారు.అనంతరం సచివాలయం వన్, టూలో నూతనంగా మంజూరైన 39 పింఛన్లను పంచాయతీ కార్యదర్శి సూరపనేని కల్పన చేతుల మీదగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రసన్న కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు చెక్కా సీతమ్మ,విఆర్ఓ సురేష్, పంచాయతీ వార్డు మెంబర్స్ రావూరి రవిబాబు,కొలకలూరి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



**గుంటూరు క్రైం, మేజర్ న్యూస్:** ప్రభుత్వ మద్యం సీసాలను అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యక్తిని శుక్రవారం వట్టిచెరుకురు పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గం వట్టిచెరుకూరు మండలం సౌపాడు గ్రామానికి చెందిన నామ సాంబశివరావు ప్రభుత్వ వైన్ షాపుల్లో మద్యం కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. సమాచారం తెలియడంతో వట్టిచెరుకూరు స్టేషన్ ఎస్ఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. అతని నుంచి 7 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## టీడీపీ, జనసేన విజయానికి కలసి కృషి చేద్దాం...



**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీ అభ్యర్థుల విజయానికి కలసి కృషి చేద్దామని పత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ బూర్ల రామాంజనేయులు అన్నారు. గ్రామాల పర్యటనలో భాగంగా గుంటూరు శివారు అంకిరెడ్డిపాలెంలో శుక్రవారం రాత్రి "బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ" కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి ఒక్క పేద కుటుంబానికి ఎంత లబ్ది చేకూరుతుందో అని వివరించారు. సామాన్యుడు బతకాలి అంటే సైకో లాంటి దుర్మార్గపు ప్రభుత్వం పోయి... చంద్రబాబు లాంటి ప్రజల ప్రభుత్వం రావాలని తెలియజేశారు. అలాగే స్థానిక ప్రజలకు భవిష్యత్తు గ్యారంటీ బాండ్లు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త నాగేశ్వరరావు, తెలుగుదేశం, జనసేన నాయకులు కార్యకర్తలు కలిసి పాల్గొన్నారు.

# లోకేష్ ఆర్థిక సహకారంతో స్వర్ణకారులకు నాలుగో విడత వృత్తి పరికరాలు



**మంగళగిరి, మేజర్ న్యూస్:** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యత ఇస్తున్నారని నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య పేర్కొన్నారు. నారా లోకేష్ ఆర్థిక సహకారంతో లక్ష్మినరసింహా గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ తరుపున మంగళగిరి షరాఫ్ బజారులోని స్వర్ణకారుల స్వయం ఉపాధికి శుక్రవారం వృత్తిపరమైన పరికరాలను అందజేశారు. 22 మంది స్వర్ణకారులకు రూ. 3 లక్షల విలువైన వృత్తి పరికరాలను సొసైటీ అధ్యక్షుడు గుంటి నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకుల ద్వారా వృత్తిదారులకు అందజేయించారు. మాచర్ల భాను ప్రకాష్, గుద్దంటి పరమేశ్వరరావు, బీటల కిషోర్, స్వర్గం భాను ప్రసాద్, ఎర్రగుంట నవీన్ కుమార్, దామర్ల శివసత్యం, నందం అజేయ్, దామర్ల సాంబశివరావు, జొన్నాదుల చంద్రశేఖర్, పంచుమర్తి తాండవ కృష్ణకు గోల్డ్ మెల్టింగ్ మెషన్లు అందజేశారు. ఉడతా నాగ వెంకట నవీన్, అల్లం లీలా సాంబశివరావు, వలనకొండ శ్రీనివాస్, రాపర్తి రాజేష్, బందారు నాగర్జున, చిల్లపల్లి దుర్గనాగేశ్వరరావు, జేఎస్ఆర్, యేనిగళ్ల వెంకటేష్, షేక్ కాజాలకు ఎలక్ట్రానిక్ ధర్మ కాటాలు అందజేశారు. మాచర్ల జగదీశ్వరరావు మెరుగు మిషన్, బిల్లా లక్ష్మినారాయణ, బందారు లక్ష్మినారాయణకు హ్యాండ్ మెషన్లు అందజేశారు. వృత్తిపరికరాలు కావాలని సొసైటీ ద్వారా నారా లోకేష్‌కు ఆర్జీ పెట్టుకోగా వెంటనే స్పందించి పనిముట్లు అందజేసినందుకు లబ్ధిదారులు లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. స్వయం ఉపాధికి నారా లోకేష్ చేయూత ఈ సందర్భంగా నందం అబద్దయ్య మాట్లాడుతూ స్వర్ణకారుల ఇబ్బందులను తెలుసుకున్న లోకేష్ వారి సమస్యలను పరిష్కరించి, ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో లక్ష్మినరసింహా గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీని స్థాపించి వృత్తిపరమైన పరికరాలను అందజేస్తున్నారని చెప్పారు. సొసైటీ ద్వారా ప్రతి స్వర్ణకారునికి వృత్తిపరికరాలను అందిస్తామన్నారు. నారా లోకేష్ సహకారంతో మరణించిన స్వర్ణకారుల పిల్లల పేరు మీద రూ. 50 వేలు డిపాజిట్ చేయడం జరుగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజల కోసం నారా లోకేష్ 27 సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్వర్ణకారుల కోసం కార్పొరేషన్, స్వర్ణకారుల భవనం ఏర్పాటుకు నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఇది వరకు స్వర్ణకారులకు చేతినిండా పని ఉండడంతో వారింట్లో కొలిములు నిత్యం వెలుగుతూ ఉండేవి. కానీ, ప్రస్తుత పరిస్థితిలో పనులు లేక వారి కుటుంబాలు అర్ధాకలితో గడుపుతున్నాయన్నారు. నలుగురికి ఉపాధి కల్పించిన స్వర్ణకారులు ఇతర వ్యక్తుల వద్ద పని చేయాల్సిన స్థితి ఏర్పడిందని వ్యాఖ్యనించారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటున్న నారా లోకేష్ ను వచ్చే ఎన్నికలలో లక్ష ఓట్ల మేజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు, లక్ష్మీనరసింహ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి గాజుల శ్రీనివాసరావు, పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, రాష్ట్ర పద్మశాలి సాధికార సమితి సభ్యులు ఊట్ల శ్రీమన్నారయణ, రాష్ట్ర తెలుగుమహిళ కార్యదర్శి వింజమూరి ఆషాబాల, నేతలు డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరరావు, సంకా బాలాజీ గుప్త, పెండ్యం శివరామకృష్ణా, మంద్రు రాము, వింజమూరి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు దామర్ల సతీష్, పీఆర్వో కందుల నాగార్జున, డైరెక్టర్లు చెల్లూరి సత్యనారాయణ, బిట్లా దుర్గారావు, నాగరాజు, శ్రీనివాసరావు, రమేష్ ఆదినారాయణ, చెరుకు పూర్ణ, గుండా గణపతి, కారంపూడి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# అరుంధతి నగర్ ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేపించే బాధ్యత తీసుకుంటాం



**గుంటూరు, మేజర్ న్యూస్ :** బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా తూర్పు నియోజకవర్గం 52వ డివిజన్ అరుంధతి నగర్ ప్రాంతాల్లో ఇంటింటికి తిరుగుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చే సంక్షేమ పథకాలను వివరించిన గుంటూరు తూర్పు నియోజకవర్గం ఇంచార్జ్ మొహమ్మద్ నసీర్ ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతు గుంటూరు తూర్పు నియోజకవర్గం 52వ డివిజన్ అరుంధతి నగర్, అంబేద్కర్ నగర్, పరమాయకుంట ప్రాంతం లో ఎప్పటినుండో ఇక్కడ నివాసం ఉంటున్నా ప్రజల ఇళ్ల బీ ఫార్మ్ పట్టాలను రిజిస్ట్రేషన్ చేపించే బాధ్యత తీసుకుంటామని డివిజన్లో ఉన్న అన్ని సమస్యలను తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని టిడిపి జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను సంక్షేమ పథకాలను అందరికీ అందేలా చేస్తామని రాష్ట్రంలో ముఖ్యంగా యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యకు పరిశ్రమలు తెచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమం టీడీపీ నాయకులు వెల్చురి కిరణ్, చాట్ల విజయ్ బాబు, సుబ్రహ్మనేస్వరావు, గోపి,సాయి, మాలకొండయ్య, విజయలక్ష్మి, హనుమయమ్మ, లక్ష్మి,బెళ్ళ వెంకటేశ్వర్లు, అబ్దుల్లా, జబి, రమేష్, ఇమ్రాన్, శ్రీను నాయక్, జనసేన నాయకులు నరిశెట్టి గోపి,రాజేష్, మీరవాలి తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించేందుకు శంకుస్థాపన



**మంగళగిరి, మేజర్ న్యూస్:** ఇద్దరూ వితంతువులు, ఇద్దరూ వికలాంగులు ఉన్న మగ తోడు లేని నిరుపేద కుటుంబానికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ అండగా నిలిచి మానవత్వం చాటుకున్నారు. దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి గత 6 నెలలుగా నెలవారి నిత్యవసర సరుకులు, బియ్యం అందచేయటంతో పాటు పక్కా ఇళ్లు నిర్మించేందుకు సన్నాద్ధమైయ్యాడు. శుక్రవారం పక్కా ఇంటి నిర్మాణానికి పారేపల్లి మహేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, తన తల్లిదండ్రులైన పారేపల్లి రామకృష్ణ, విజయలక్ష్మి దంపతులు చేతులు మీదుగా శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్న మహేష్ ను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, స్దానిక వాసులు అభినందించారు. గురువారం రేవంద్రపాడు వంతెన వద్ద ఎదురు బొంగులతో సైడ్ వాల్ నిర్మించారు. ఈ సందర్బంగా పారేపల్లి మాట్లాడుతూ నిరుపేద కుటుంబం పాకలో గులకరాళ్ళ మీద చాపలు వేసుకుని పడుకోవడం బ్యానర్లను ఇంటికప్పులాగా వేసుకొని జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారేపల్లి మహేష్ సేవలు అభినందనీయం : మురుగుడు హనుమంతరావు ఎమ్మెల్సీ హనుమంతరావు మాట్లాడుతూ సమాజం కోసం తపనపడే పారేపల్లి మహేష్ దివ్యంగులైన ఈ కుటుంబాన్ని దత్తత తీసుకోవడమే కాకుండా ఇల్లు కట్టించడం తన మంచి మనసుకు తార్కాణం అని పేర్కొన్నారు. అదేవిధంగా తను కూడా ఈ కుటుంబానికి అవసరమైన సహాయం చేస్తానని మాట ఇచ్చారు. అలాగే పారేపల్లి మహేష్ తల్లిదండ్రులు మాట్లాడుతూ మా కుమారుడు ఈ విధంగా ప్రజలకు సహాయపడటం మాకు చాలా ఆనందంగా ఉందని తనకి ప్రతి కార్యక్రమంలో అండగా ఉంటున్న బీసీ సంక్షేమ సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అలానే కుటుంబ భారం మొత్తం భుజాన్ని వేసుకున్న కోడలు సమాన్ మారెమ్మను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర నాయకులు కొల్లూరు హనుమంతరావు, నియోజకవర్గం అధ్యక్షులు వుడతా శ్రీనివాస్ జాయింట్ సెక్రటరీ తిరువీధుల కిరణ్, యువజన అధ్యక్షులు ఆలా శివాజీ, పట్టణ అధ్యక్షులు మంద్రు సత్యనారాయణ, సెక్రటరీ ఎనుముల నరసింహారావు, గుంటూరు పట్టణ అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కర్, ఎర్రబాలెం మండల అధ్యక్షులు అలా సాంబయ్య దుగ్గిరాల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పాల ఆనందబాబు, మాదు వెంకటేశ్వరరావు, ఇసునూరి నగేష్, కాట్రు ధనుంజయ్, జంజనం వరప్రసాద్, చిల్లపల్లి నాగరాజు, కొల్లి నాగేంద్ర, బాలాజీ గొడ్డెలగల జయలక్ష్మి, దానబోయిన సునీత, మున్నంగి ప్రమీల, ఉయ్యూరు రాజేశ్వరి, చొప్పర శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# సంతృప్త స్థాయిలో పథకాలు



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, జనవరి 5, మేజర్ న్యూస్ :** నూటికి నూరు శాతం సంతృప్త స్థాయిలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధి అందాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు–ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. వివిధ సంక్షేమ పథకాలకు అర్హత ఉండి నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోలేకపోవడం, బ్యాంకు ఖాతా వివరాలు సరిగా లేకపోవడం తదితర కారణాల వల్ల మిగిలిపోయిన వారికి నవరత్నాలు–ద్వై వార్షిక నగదు మంజూరు కార్యక్రమం ద్వారా లబ్ధి మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి.. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా కలెక్టర్ ఎస్.డిల్లీరావు.. డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులతో కలిసి హాజరయ్యారు. బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదును జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించిన అనంతరం కలెక్టర్ డిల్లీరావు.. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి పథకాల లబ్ధిదారులు, విద్యార్థులకు రూ. 4.37 కోట్ల మెగా చెక్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలను అమలుచేస్తోందని.. కేలండర్ ప్రకారం ఈ పథకాల లబ్ధిని అందించడం జరుగుతోందన్నారు. అర్హత ఉండి ఏ కారణంచేతనైనా లబ్ధి చేకూరకుండా ఉంటే వెంటనే గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదించి దరఖాస్తు చేసుకుంటే వెరిఫికేషన్ చేసి ద్వై వార్షిక నగదు మంజూరు కార్యక్రమంలో లబ్ధి చేకూర్చడం జరుగుతోందన్నారు. ఇలా జూన్/జులైలో ఒకసారి, డిసెంబర్/జనవరిలో మరోసారి లబ్ధిచేకూర్చుతున్నట్లు తెలిపారు. ఈ విడతలో ద్వై వార్షిక నగదు మంజూరు కింద జగనన్న అమ్మ ఒడి, వైఎస్ఆర్ కాపునేస్తం, వైఎస్ఆ ర్ వాహనమిత్ర తదితర పథకాలకు సంబంధించి 2,934 మంది లబ్ధిదా రులకు రూ. 4.37 కోట్ల మేర లబ్ధి చేకూరుతోందని కలెక్టర్ వివరించారు.

**అత్యంత పారదర్శకంగా పథకాల లబ్ధి:** రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచి వాలయాల స్థాయిలో అత్యంత పారదర్శకత, జవాబుదారీతనంతో అర్హులం దరికీ సంతృప్తికర స్థాయిలో పథకాలు అందించడం జరుగుతోందని కలెక్టర్ డిల్లీరావు తెలిపారు. సోషల్ ఆడిట్ కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో లబ్ధి దారుల జాబితాలను ప్రదర్శిస్తున్నట్లు వెల్లడించారు. లబ్ధిదారులు పథకాలను సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని కలెక్టర్ డిల్లీరావు సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ టి.జమల పూర్ణమ్మ, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ తోలేటి శ్రీకాంత్, రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బండి శివశక్తి పుణ్యశీల, జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ షేక్ గౌస్ మోహిద్దీన్, విజయవాడ డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజారెడ్డి, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు హాజరయ్యారు.

**శుక్రవారం నవరత్నాలు-ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమం కింద జరిగిన లబ్ధి వివరాలు.. పథకం లబ్ధిదారులు లబ్ధి మొత్తం (రూ.లక్షల్లో)**

1. జగనన్న అమ్మ ఒడి 1,651,235.4
2. వైఎస్ఆర్ కాపునేస్తం 8713.05
3. వైఎస్ఆర్ వాహనమిత్ర 175 24.45
4. ఈబీసీ నేస్తం 192 28.80
5. జగనన్న చేదోడు 756 75.60
6. వైఎస్ఆర్ కళ్యాణమస్తు 73 59.20

మొత్తం 2,934,436.53

# ఆ తహసీల్దార్ కాసులు ఇస్తే.. వరాలిస్తారు

## సొంత డివిజన్ లో విధులు నిర్వహిస్తున్న వైనం

## ప్రభుత్వ నిబంధనలు పాటించని తహసీల్దార్

**విజయవాడ బ్యూరో జనవరి 5 మేజర్ న్యూస్ :** వత్సవాయి మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కి కాసులు ఇస్తే వెంటనే అడిగిన వరాలిచ్చి పంపిస్తారు అనే నానుడి బాగా వినిపిస్తోంది. ఎన్నో సంవత్సరాల నుండి పెండింగ్ లో ఉన్న రెవిన్యూ సమస్యలను స్థానిక అధికార పార్టీకి చెందిన ఓ ప్రజా ప్రతినిధి అండతో ఆ అధికారి పరిష్కారం చేశారు అనే దాని వెనక కొన్ని కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపణలు కూడా మండలంలో బాగా వినిపిస్తున్నాయి. ఆ తహసీల్దార్ ఈ ప్రాంతానికి చెందినవారు కావడంతో ఈ ప్రాంతంలో ఉన్న బంధుమిత్ర పరిచయాలతో కొంతమంది రెవెన్యూ బ్రోకర్లను తయారు చేసుకొని కాసులను వసూలు చేస్తూంటారు అని బాధితులు వాపోతున్నారు. సొంత నియోజకవర్గంలో ఉద్యోగం చేయకూడదు అనే నిబంధన ఉన్నప్పటికీ ఇక్కడ ఉద్యోగం చేయడం చట్టరీత్యా నేరం అయినప్పటికీ ఆ అధికారి ఈ ప్రాంతంలో పనిచేయటం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ప్రతి రెవిన్యూ సేవకు ఒక రేటును కేటాయించి అవినీతికి పాల్పడటం ఈయనకు పరిపాటిగా ఉంది. ఇతర దేశాలలో ఉద్యోగం చేస్తున్న( ఎన్ ఆర్ ఐ)వారిని టార్గెట్ చేసుకొని వారి భూ సమస్యలకు భారీ మొత్తంలో వారి నుండి మామూలు వసూలు చేసినట్లు సమాచారం.ఈ విధంగా రెవిన్యూ రికార్డులను నారుమారు చేయడంలో నైపుణ్యం కలిగిన కొంతమంది విఆర్ఓల సహాయంతో ఈ కార్యాలయంలో అవినీతి రోజురోజుకీ పెరిగిపోతుంది. ఎమ్మార్వో మండలంలో పనిచేసే విఆర్వోలను నాయకులతో బెదిరించి కలెక్షన్ ఏజెంట్లుగా చేస్తున్నారు అని లేకుంటే వారిని అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఈ ప్రాంతంలో ప్రచారం బాగా జరుగుతుంది. అవినీతిపరుల అధికారుల వలన సామాన్యులకు రెవెన్యూ సేవలు అందే పరిస్థితి లేదని బాధితులు వాపోతున్నారు. ఈ కార్యాలయంలో రెవెన్యూ సేవలు ఆయన తయారు చేసుకున్న ఏజెంట్ల ద్వారా లేక అగ్రకుల, ధనవంతులకే తప్ప సామాన్య ప్రజలకు అందే పరిస్థితి కనిపించడం లేదు. రెవిన్యూ బ్రోకర్లకు రెవిన్యూ సేవలు అందించడంలో ఆ అవినీతి అధికారులు ఉత్సాహం చూపిస్తున్నారు అని, దళిత ప్రజా ప్రతినిధులను సైతం లెక్కచేయడం లేదని వారు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఈ విధంగా వత్సవాయి మండల రెవెన్యూ కార్యాలయంలో అవినీతి తారా స్థాయికి చేరుతుందని జిల్లా అధికారులు స్పందించి విచారణ జరిపించే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. మండలంలోని ఒక గ్రామ రెవెన్యూ భూముల సమస్యను పరిష్కరించడానికి సుమారు రెండు కోట్ల 50 లక్షల రూపాయలు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. “పూర్తి ఆధారాలతో మరో కథనం రేపటి సంచికలో”...

# అర్హత పొందిన లబ్ధిదారుల ఖాతాలకు రూ.5 కోట్లు జమ

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** వివిధ సాంకేతిక కారణాలతో నవరత్నాల పథకాలకు సంబంధించి అర్హత వుండి లబ్ది చేకూరని వారికి ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమం క్రింద జిల్లాలోని 3,317 మంది లబ్దిదారులకు 5 కోట్ల ఏడు లక్షల రూపాయలను నేరుగా వారి ఖాతాలకు జమ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్ రెడ్డి ఆగష్టు, 2023 నుంచి డిసెంబరు, 2023 వరకు అమలైన వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఏ కారణం చేతనైనా లబ్ది అందని 68,990 మంది అర్హులకు, రూ.97.76 కోట్లను ఆన్లైన్ ద్వారా బటన్ నొక్కి లబ్దిదారుల ఖాతాల్లో జమ చేసిన కార్యక్రమంలో గుంటూరు కలక్టరేట్ లోని వీసి సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు మద్దాలి గిరిధర రావు కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి, కృష్ణ బలిజ, పూసల సంక్షేమము, అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ కోలా భవాని మణికంఠ, విభిన్న ప్రతిభావంతుల, సీనియర్ సిటీజన్ సహాయ కార్పొరేషన్ చైర్ పర్సన్ ముంతాజ్ పఠాన్ పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి మీడియా వారితో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వైయస్. జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాల పథకములకు సంబంధించి అర్హత వుండి లబ్ది చేకూరని వారికి 2023-24 ఆర్ధిక సంవత్సరమునకు నవరత్నాలు ద్వైవార్షిక నగదు మంజూరు కార్యరకమం క్రింద వివిధ పథకాల లబ్దిదారులకు బటన్ నొక్కి డిబిటి ద్వారా నేరుగా నగదు జమ చేయడం జరిగిందని తెలిపారు. గుంటూరు జిల్లాకు సంబంధించి వివిధ పథకముల క్రింద అర్హత వుండి లబ్ది చేకూరని 3,317 మందికి 5 కోట్ల ఏడు లక్షల రూపాయలు డిబిటి ద్వారా వారి ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి ఈబీసీ నేస్తం పథకం క్రింద 359 మందికి రూ. 53.85 లక్షలు, జగనన్న అమ్మ ఒడి క్రింద 2037 మందికి రూ. 292.54 లక్షలు, జగనన్న తోడు క్రింద 540 మందికి రూ. 54 లక్షలు, వైయస్సార్ కళ్యాణ మస్తు / వైయస్సార్ షాదీ తోఫా క్రింద 75 మందికి రు. 69.80 లక్షలు, వైయస్సార్ కాపు నేస్తం క్రింద 130



మందికి రూ. 19.50 లక్షలు, వైయస్సార్ నేతన్న నేస్తం క్రింద ఇద్దరికి రూ. 48 వేలు, వైయస్సార్ వాహన మిత్ర క్రింద 174 మందికి రూ. 17.40 లక్షలు లబ్ది చేకూరిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు క్రమం తప్పకుండా పారదర్శకంగా లబ్ది పొందని అర్హులను గుర్తించి వారికి ఆర్ధిక సహాయాన్ని అందిస్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో పీడీ డీఆర్డీఏ హరిహర నాథ్, డీడీ సాంఘీక సంక్షేమ శాఖ మధుసూధన రావు, బీసీ కార్పొరేషన్ ఈడి దుర్గాబాయి, డిఈఓ శైలజ, లబ్దిదారులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయిలో గుంటూరుకు గుర్తింపు

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** గుంటూరు జిల్లాలోని మంగళగిరి చేనేత చీరలు, ఫ్యాబ్రిక్స్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్టాత్మకమైన ఒన్ డిస్ట్రిక్ ఒన్ ప్రోడక్ట్ జాతీయ స్పెషల్ మెన్షన్ అవార్డును అందుకున్న జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డికి ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే మద్దాళి గిరి, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నూరి ఫాతిమా, మంగళగిరి ఇన్‌ఛార్జ్ గంజి చిరంజీవితో కలిసి లేళ్ళ అప్పిరెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, అత్యంత నాణ్యత, అత్యుత్తమ మన్నికకే కాక మన సంస్కృతీ సంప్రదాయా లకు మంగళగిరి చేనేత వస్త్రాలు చక్కని చిహ్నాలని వ్యాఖ్యానించారు. అందుకే వైయస్ జగన్ ముఖ్యమంత్రిగా పాలనా పగ్గాలు చేపట్టిన తొలి నాళ్ళలోనే చేనేతకు చేయూత అందించారని తెలిపారు. ఫలితంగా నేతన్నలు సంక్షేమ బాటలో మరింత నాణ్యమైన వస్త్రాలు తయారు చేసేందుకు మార్గం సుగమమైందని పేర్కొన్నారు. అలా ఉత్పత్తి అయిన వస్త్రాల అమ్మకాల కోసం గుంటూరు రైల్వేస్టేషన్లో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేయటంతో పాటు, ప్రతి సోమవారం జిల్లా కేంద్రం కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమంలో కూడ వస్త్రాల విక్రయాల కౌంటర్ ఏర్పాటు చేసి విస్తృతస్థాయిలో మార్కెటింగ్ సౌకర్యం కల్పించటానికి జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి చూపిన ప్రత్యేక శ్రద్ధ కనబరిచారని ప్రశంసించారు. తద్వారా జాతీయ స్థాయిలో మంగళగిరి చేనేతకు, గుంటూరు జిల్లాకు సముచిత స్థానం తెచ్చిన జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డిని ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

## బీజేపీ ప్రత్తిపాడు మండల అధ్యక్షుడిగా కటారి దత్త ప్రసాద్ నియామకం



**గుంటూరు, మేజర్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ ప్రతిపాడు మండల అధ్యక్షుడిగా కటారి.దత్త ప్రసాద్ సాగర్ ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దత్త ప్రసాద్ సాగర్ 2018 నుంచి బిజెపిలో ఉంటూ పార్టీ నిర్దేశించిన అన్ని కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటుడడంతో పార్టీ హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా దత్త ప్రసాద్ సాగర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్షునిగా నియమించిన బిజెపి జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర కుమార్ కు, ఇతర పెద్దలకు కృతజ్ఞతలు తెలిపాడు... పార్టీలో అందర్నీ కలుపుకొని, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు అన్నిటిని అందరికి చేరవేస్తానని, ప్రజా సమస్యల మీద పోరాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు...

# న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం చేస్తాం

## జనసేన రాష్ట్ర కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్




**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** కార్మికుల న్యాయ సమ్మత మైన డిమాండ్లు నెరవేర్చేవరకు కార్మిక సంఘాలు చేపట్టిన సమ్మెకు జనసేన పార్టీ పూర్తి మద్దతునిస్తుందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ అన్నారు. నగర జనసేన అధ్యక్షుడు నేరేళ్ళ సురేష్ ఆధ్వర్యంలో కార్మికుల సమ్మెకు మద్దత్తుగా జరిగిన భారీ ర్యాలీలో ఆయన పాల్గొని ప్రసం గించారు. ఈ సందర్భంగా బోనబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులు కోరుతున్నవి గొంతెమ్మ కోర్కెలేమి కాదని అసెంబ్లీ సాక్షిగా జగన్ రెడ్డి ఇచ్చిన హామీలేనన్నారు. తనని తాను పేదల పక్షపాతిగా అభివర్ణించుకునే జగన్ రెడ్డికి పారిశుద్ధ్య కార్మికుల కష్టాలు ఎందుకు పట్టడం లేదని బోనబోయిన ప్రశ్నించారు. జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాది మనసున్న ప్రభుత్వం అని చెప్పుకునే ముఖ్యమంత్రికి కార్మికుల జీతాన్ని పెంచటానికి మనసెందుకు రావటం లేదన్నారు. నలభై ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వారికి కూడా ఉద్యోగ భద్రత లేకపోవడం దుర్మార్గమన్నారు. నగర అధ్యక్షుడు నేరేళ్ళ సురేష్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ కార్మికుల పక్షపాతి అన్నారు. కార్మికులకు గుర్తుగా ఎర్ర కండువాను మెడలో వేసుకుంటారని, జనసేన అధికారంలోకి రాగానే కార్మికుల సమస్యలపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని నేరేళ్ళ సురేష్ అన్నారు. రాష్ట్ర కార్మిక యూనియన్ సభ్యులు సోమి శంకరరావు,జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి, రెల్లి యువ నేత సోమి ఉదయ్ కుమార్ జనసేన పార్టీ, టీడీపీ నేతలు, టీ యన్ టీ యు సీ నాయకులు నాగ గౌడ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యం రూ.25 లక్షలకు పెంపు

**పెడన, మేజర్ న్యూస్ :** నిరుపేదలు ఆర్థికంగా ఎదగడానికి, పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్న మనసున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి అండగా నిలవాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ లబ్ధిదారులకు సూచించారు. ఈ మేరకు వైఎస్సార్ పింఛన్ కానుకపథకం కింద ప్రభుత్వం 2024 జనవరి 1 నుండి పింఛన్లు నెలకు 3 వేల రూపాయలకు పెంచిన సందర్భంగా శుక్రవారం పెడన మార్కెట్ యార్డ్ ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని పెడన పట్టణ పరిధిలోని లబ్ధిదారులకు, కొత్తగా పింఛన్ మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలతో పాటు పెంపు చేసిన 3 వేల పింఛను డబ్బులు, సీఎం లేఖ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పెడన పట్టణ పరిధిలో కొత్తగా పింఛన్ మంజూరైన 43 మందితో కలిపి మొత్తం 4576 మంది లబ్ధిదారులకు నెలకు 3 వేల చొప్పున రు.1,37,60,000/-అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పెడన పట్టణ పరిధిలో 2250 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్ళు కట్టించే కార్యక్రమం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. చేనేత కార్మికులకు పింఛన్లతో పాటు ఒక్కో కుటుంబానికి 5 విడతల మగ్గం డబ్బులు రు. 1.20 లక్షలు అందించామన్నారు. క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలతో పాటు అవ్వా తాతలకు పింఛన్ల పండుగ వచ్చిందన్నారు. జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు జనవరి 1నుండి 3 వేలకు పెంపు చేసి అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో పింఛన్ల కోసం పంచాయతీ ఆఫీసుల చుట్టూ తిరిగే పరిస్థితులు ఉండేవని, జగన్ ముఖ్యమంత్రి కాగానే వాలంటీర్లు ప్రతి నెల 1వ తేదీనే నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తెల్లవారకముందే తలుపు తట్టి పింఛన్లు మీ చేతుల్లో పెడుతున్న విషయం మరచిపోరాదని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మంత్రి వివరిస్తూ పేదలు చదువుకు దూరం కాకూడదని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మీ పిల్లలను



చదివిస్తూ తల్లుల ఖాతాలో అమ్మఒడి డబ్బులు జమ చేస్తున్నారని అన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయం తో పాటు హెల్త్ క్లినిక్ రైతు భరోసా కేంద్రం నిర్మించి ప్రభుత్వ సేవలు గ్రామంలోని అందుబాటులోకి తెచ్చారన్నారు. అవ్వ తాతలు ఆరోగ్యంగా ఉండాలని ఇంటి వద్దనే ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యం 25 లక్షలకు పెంపు చేయడంతో పాటు అనారోగ్యంతో మంచం మీద ఉన్న రోగులకు మందులు పోస్ట్ ద్వారా కూడా పంపుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పెడన మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగకుమారి, వైస్ చైర్ పర్సన్ లు ఎండి ఖాజా, బైలపాటి జ్యోతి, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, పట్టణ వైసీపీ కన్వీనర్ బండారు మల్లికార్జునరావు,వైసీపీ కౌన్సిల్ సభ్యులు, ఇన్చార్జ్ కమిషనర్ ఏసుబాబు, తాసిల్దారు మధుసూదనరావు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్ మీద ఆశ కలిగించాలి



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** విద్యార్థులకు సమస్యలు ఎదురైనప్పుడు అధ్యాపకులుగా, కౌన్సిలర్లుగా వారికి భవిష్యత్ మీద ఆశ కలిగించాలని ఐఏఎన్ఎల్పీ ( ఇంటర్నేషనల్ న్యూరో లింగ్విస్టిక్ ప్రోగ్రామ్) ప్రెసిడెంట్ విశేష్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని సోషల్ సైన్సెస్ అండ్ హుమానిటీస్, అకాడమీ ఫర్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్, ఐక్యూఏసీ, ఏపీఏ ఇండియాల సంయుక్త ఆధ్వర్యంలో "ఎంపవరింగ్ త్రూ ప్రివెన్షన్ - ప్రొఫెషనల్ ట్రైనింగ్ ఆన్ లైఫ్ - సేవింగ్ ఎడ్యుకేషన్" అనే అంశంపై మూడు రోజుల పాటు అధ్యాపకులకు, కౌన్సిలర్‌లకు నిర్వహించే వర్క్‌షాప్‌ను ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐఏఎన్ఎల్పీ ప్రెసిడెంట్ విశేష్ మాట్లాడుతూ అధ్యాపకులుగా మీరందరూ విద్యార్థులను ఎప్పుడు కూడా సరికొత్తగా ఆలోచించే విధంగా ప్రోత్సహించాలన్నారు. అలా చేయనట్లైతే మెదడు చెడు ఆలోచనలవైపు దృష్టిమరలుతుందన్నారు. తరగతిగదిలో ఉపాధ్యాయుడు లీడర్‌గా మారి తన ఫిలాసఫీని, తన ఆదర్శాలను విద్యార్థుల ముందుంచి వారిని గొప్ప ఆవిష్కర్తలుగా తయారుచేయాలని సూచించారు. తరగతిగదిలో పాఠ్యాంశాలను బోధించేటప్పుడు అధికార గర్వం కన్నా ప్రజాస్వామిక దృక్పథం ప్రధానమన్నారు. ఉపాధ్యాయుడు అనే భావనకు బదులుగా తరగతిగదిలో తాను భాగస్వామిననే భావన కలిగి ఉండాలని పేర్కొన్నారు. తరగతిగదిలో ఉన్న విద్యార్థి మెరుగుపడటంతో పాటు.. తాను కూడా వారితో పాటు మెరుగుపడుతున్నాననే భావనతో పనిచేస్తే ఉత్తమ ఉపాధ్యాయునిగా గుర్తింపు పొందుతారన్నారు. తనకంటే గొప్పవారిగా తన విద్యార్థులను తయారుచేయాలనే కోరిక ప్రతి ఉపాధ్యాయునిలో తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన జీవీఏ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైకాలజీ ఫౌండర్, క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ శ్రీకాంత్ గోగి మాట్లాడుతూ అధ్యాపకులు విద్యార్థుల సమస్యలను గుర్తించడంతో పాటు వారి భావోద్వేగాలను అర్థం చేసుకుని సునిశితంగా పరిష్కరించాలన్నారు. జీవితంలో ప్రతి విద్యార్థి కూడా కఠినమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అటువంటి సందర్భాలలో విద్యార్థులు ఆందోళన చెంది, ఒత్తిడికి గురై సమస్యలను పరిష్కరించలేమనే నిరాశకు గురికాకుండా పరిష్కారానికి గల అనువైన పద్ధతులను వెతికేలా ట్రైనింగ్ ఇవ్వాలన్నారు. విద్యార్థులు ధైర్యంతో ముందుకు సాగితే జీవితంలో ఏదైనా సాధించగలరని నమ్మకాన్ని వారిలో కలిగించాలన్నారు. విద్యార్థుల ఎదుగదలలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో ఏపీఏఐ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ క్రిష్ణ భరత్, నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ జీ.రాజేశ్వరరావు, నేషనల్ సెక్రటరీ రవిభార్గవ్, ఏపీఏఐ ఏపీ కమిటీ ప్రెసిడెంట్ ఎమ్పీ జానకిరామ్, వైస్ ప్రెసిడెంట్ పీవీవీ ప్రసాద్, ట్రెజరర్ అత్తోట తేజ, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



## అడ్వాన్సెస్ ఇన్ డిస్ట్రిబ్యూటెడ్ కంప్యూటింగ్, మెషిన్ లెర్నింగ్‌పై 5వ అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

**తుళ్లూరు మేజర్ న్యూస్ :** విఐటి-ఏపి విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో అడ్వాన్సెస్ ఇన్ డిస్ట్రిబ్యూటెడ్ కంప్యూటింగ్, మెషిన్ లెర్నింగ్ పై 5వ అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమయ్యింది. ఈ సమావేశాన్ని రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ సదస్సులో పరిశోధకులు, విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణుల మధ్య సహకారాన్ని పెంపొందించడానికి, జ్ఞాన మార్పిడికి వేదికగా ఉపయోగపడుతుంది, డిస్ట్రిబ్యూటెడ్ కంప్యూటింగ్, మెషిన్ లెర్నింగ్‌లో అభివృద్ధి పరిణామాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ప్రారంభకార్యక్రమానికి ముఖ్య అతిధిగా సుమీత్ వర్మ (ఇంటెల్ టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో డైరెక్టర్ (స్ట్రాటజీ) హాజరై సదస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ అభివృద్ధి, సాంకేతిక అంశాలపై తనదైన శైలిలో సూచనలు చేసారు. ఈ సదస్సుకు ప్రముఖ కన్వీనర్లుగా డాక్టర్ ఉమాకాంత్ నందా, డాక్టర్ రవీంద్ర ధూలి వ్యవహరించగా, డాక్టర్ లఖన్ దేవ్ శర్మ, డాక్టర్ రోహిత్ లోరెంజో జనరల్ చైర్స్ గా వ్యవహరించారు. విఐటి-ఏపి విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ డాక్టర్ ఎస్. వి. కోటా రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం యొక్క అకడమిక్ విజయాలు, మైలురాళ్లను హైలైట్ చేశారు. ఈ సదస్సులో వివిధ విశ్వవిద్యాలయాలు, ఇండస్ట్రీలకు చెందిన దాదాపు 200.మందివిద్యార్థులు,ఉపాధ్యాయులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొని తమ పరిశోధన పత్రాలను సమర్పించారు.

## రేవినిశెట్టి సత్యనారాయణ మరణం తీరని లోటు



**విజయవాడ, మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులు, కాపు సంక్షేమ సేన రైతు సంఘం అధ్యక్షులు రేవినిశెట్టి సత్యనారాయణ ఆకాల మరణం నూజివీడు నియోజకవర్గ జనసేన పార్టీకి తీరని లోటని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్ అన్నారు. శుక్రవారం అగిరిపల్లి మండలం లోని సగ్గురు గ్రామంలో ఆయన పార్ధివదేహానికి మండలి రాజేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని మండలి రాజేష్ తెలియజేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ప్రజారాజ్యం పార్టీ స్థాపించిన నాటి నుంచి ఎంతో కీలకంగా పనిచేశారు. కాపులలో ఐక్యమత్యం తీసుకురావడం కోసం కాపు సంక్షేమ సేనలో కూడా సేవలందించారని, ఆ తర్వాత జనసేన పార్టీకి ఆకర్షితులై జనసేనాని ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చిన నిస్వార్ధంగా పాల్గొని జనసేన పార్టీని బలోపేతానికి అవిశ్రాంతంగా కృషి చేసిన వ్యక్తి రేవినిశెట్టి సత్యనారాయణ అని రాజేష్ తెలియజేశారు. ప్రత్యర్థులకు తన వాగ్ధాటితో బలంగా సమాధానం చెప్పేవారని, అలాంటి వ్యక్తి ఈ రోజున మన మధ్యన లేకపోవడం జనసేన పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు, గన్నవరం నియోజకవర్గాల పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ బర్మా ఫణి బాబు, చలమలశెట్టి రమేష్, ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీధు.శివరామకృష్ణ, జిల్లా కార్యదర్శి బండ్రెడ్డి రవి, జిల్లా సంయుక్త కార్యదర్శి రెడ్డి మణి, నూజివీడు మండల అధ్యక్షులు యర్రంశెట్టి రాము, గరికపాటి శివ శంకర్, విజయవాడ రూరల్ మండల అధ్యక్షులు పొదిలి దుర్గారావు, మండల అధ్యక్షులు వడ్డే శివ నాగేశ్వరరావు, దుర్గగుడి ధార్మిక మండలి సభ్యురాలు నీట్లా ఉమామహేశ్వరి, కూనపురెడ్డి రమేష్, ముత్యాల కామేష్, సునీల్ కుమార్, పాతూరి రవి, కోదండపాణి పాల్గొన్నారు.



# భవాని దీక్షా విరమణలలో పెరగనున్న భక్తుల రద్దీ

## అవాంచనీయ సంఘటలు జరుగకుండా చర్యలు చేపట్టండి

## అధికారులతో సీపీ సమీక్ష



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దీక్షా మాల విరమణలు పురస్కరించుకొని ఈ నెల 3 నుండి 7 వ తేదీ వరకు 5 రోజుల పాటు నగరంలో జరుగుతున్న భవాని దీక్షా విరమణల సందర్భంగా శుక్రవారం రాత్రి నుండి నగరంలో పెరగనున్న భవానీ భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకుని ఈ రోజు దుర్గాఘాట్ సమీపంలోని మోడరన్ గెస్ట్ హౌస్‌లో బందోబస్తు నిర్వహించు అధికారులతో నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా సమీక్షా సమావేశం నిర్వహించి ఎక్కడా ఎటువంటి అవాంచనీయ సంఘటలు జరుగకుండా ఉండెందుకు తగు సూచనలను, సలహాలను అందించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఈ రోజు రాత్రి నుండి రాష్ట్రంలోని నలుమూలల నుండి భవాని భక్తులు అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో వస్తారు. బందోబస్తు నిర్వహించు ప్రదేశాలలో భక్తులు ఎక్కడా నిలబడకుండా కదులుతూ ముందుకు వెళ్ళే విధంగా చూడాలని ముఖ్యంగా దర్శనం అనంతరం కనకదుర్గా నగర్ లోని హోమగుండాలు, మాల విరుముడి విరమణ, ప్రసాదం కౌంటర్ల వద్ద, కనకదుర్గా నగర్ నుండి వినాయక టెంపుల్ వరకు కెనాల్ రోడ్డులో భక్తులు నిలబడకుండా ఎప్పటికప్పుడు ముందుకు కదిలే విధంగా చర్యలు తీసుకోవాలని, విధులు నిర్వహించు సమయంలో ఎక్కడా సిబ్బంది అలసత్వం ప్రదర్శించ కుండా విధులు నిర్వహించి మాల విరమణ చేయు భవానీ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అందరికి అమ్మవారి దర్శనం అయ్యేవిధంగా, గిరి ప్రదక్షణ, హోమగుండాలు, మాల విరుముడి విరమణ ప్రశాంత వాతావరణంలో చేసే విధంగా, ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా అన్ని శాఖల అధికారులతో సమన్వయము చేసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అదేవిధంగా హోమగుండాలు, మాల విరుముడి విరమణ, ప్రసాదం కౌంటర్ల వద్ద, అన్నదానం చేయు ప్రదేశాలలో తగు సిబ్బందిని నియమించి భక్తులు ఎక్కడా వేచివుండకుండా త్వరితగతిన అయ్యేవిధంగా చూడాలని టెంపుల్ అధికారులకు తగు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్.టి.ఆర్. జిల్లా నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటాతో పాటు, డి.సి.పి. విశాల్ గున్ని, ట్రాఫిక్ డి.సి.పి. కె.చక్రవర్తి, టెంపుల్ ఈ.ఓ. కె.ఎస్.రామారావు, పశ్చిమ ఏ.సి.పి. డా.కె.హనుమంతరావు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## చెవిటికల్లులో గడపగడపకు మన ప్రభుత్వం

**కంచికచర్ల జనవరి 5 మేజర్ న్యూస్ :** మండలంలోని చెవిటికల్లు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం ఉదయం నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్ రావు నిర్వహించారు ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల బుక్ లెట్ లను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైయస్ జగన్ పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వాల హయాంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచాయని చెప్పారు. ప్రజలకు పారదర్శక పాలన అందించడంతో పాటు నిరుపేదల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారని కొనియాడారు. పథకాల అమల్లో పక్షపాత వైఖరి చూపకుండా అన్ని వర్గాలకు అర్హతే ప్రామాణికంగా అందిస్తున్నారని తెలిపారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారన్నారు. పేదల మనసెరిగి పాలన చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు..

## ఒన్ మిలియన్ వాలంటీర్స్ ఎన్రోల్మెంట్ ప్రోగ్రాం



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** కృష్ణా విశ్వ విద్యాలయం లో ఎన్. సీ. సీ, ఇండియన్ రెడ్ క్రాస్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ బ్రాంచ్ సంయుక్త ఆధ్వర్యంలో ఒన్ మిలియన్ వాలంటీర్స్ ఎన్రోల్మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు, కృష్ణా విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య జి. జ్ఞానమని, ఇండియన్ రెడ్ క్రాస్ ఏ. పి. స్టేట్ బ్రాంచ్ జనరల్ సెక్రటరీ ఏ. కే. పరిధా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజా బాబు మాట్లాడుతూ రెడ్ క్రాస్ ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందిస్తుందని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో రెడ్ క్రాస్ ఎల్లపుడు ముందుంటుందన్నారు. అంతేగాక విద్యార్థి వయస్సులోనే సేవాభావం అలవాటవుతుందాన్నారు. రెడ్ క్రాస్ ఏ. పి స్టేట్ బ్రాంచ్ జనరల్ సెక్రటరీ ఏ. కె. పరీదా మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలను వివరిస్తూ ఏ. పి స్టేట్ రెడ్ క్రాస్ కార్యక్రమాలను వివరించారు. వాలంటీర్స్ గా చేరిన విద్యార్థులను వాతావరణ ముందస్తు చర్యలలో, మొక్కలు నాటుటలో, విపత్తు నిర్వహనలలో, ఆరోగ్య శిభిరాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలలో వినియోగించుకుంటారని తెలిపారు. విద్యార్థులు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా ముందుకొచ్చి వాలంటీర్స్ గా చేరాలన్నారు. యూనివర్సిటీ ఉపకులపతి జ్ఞానమని మాట్లాడుతూ రెడ్ క్రాస్ సభ్యత్వం పొందటం గొప్ప అర్హతగా విద్యార్థులు భావించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబును సన్మానించారు. ఈ కార్యక్రమం లో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వీర బ్రాహ్మచారి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. విజయ కుమారి, ఎన్. సీ. సీ విభాగం అధికారి డాక్టర్ డి. రామ శేఖర రెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్స్, ప్రాజెక్ట్స్ సమన్వయ కర్త బి. వి. ఎస్. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత చైతన్య వేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ క్యాంటీన్



**నందిగామ, జనవరి 5, మేజర్ న్యూస్:** దళిత చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన "అంబేద్కర్ క్యాంటీన్" ను ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ప్రతిరోజు పేదలకు భోజనం అందించడానికి.. అంబేద్కర్ క్యాంటీన్ కు నా వంతు సహాయ సహకారాలు అందిస్తా అన్నారు. రాజ్యాంగ నిర్మాణం ద్వారా బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నిలిపిన మహనీయుడు అంబేద్కర్.. ప్రతి ఒక్కరికి సమాన విలువలు ఉండాలనే ఆకాంక్షతో సమానత్వపు హక్కు సాధనకు కృషి చేసిన మానవతావాది అంబేద్కర్ అన్నారు. ఆకలితో వచ్చే పేదవాళ్లకు గౌరవంగా భోజనం అందించండి. పుట్టినరోజులు, దశదినకర్మల జ్ఞాపకార్థం పెట్టే పార్టీల పేరుతో పెట్టే భోజనాల మాదిరి కాకుండా కుల, వర్ణ వివక్షను రూపుమాపే అంబేద్కర్ ఆశయాలతో క్యాంటీన్ నడపాలి. దళిత చైతన్య వేదిక ప్రతినిధులు పెసరమల్లి శేఖర్, కన్నెగంటి సజ్జనరావు లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేనివిధంగా అంబేద్కర్ క్యాంటీన్ పేరుతో ఉచిత భోజనం పంపిణీ నిర్వహించడం ఆదర్శనీయం అన్నారు. విజయవాడలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేయటం ద్వారా.. ఆయన ఆలోచనా విధానాలు.. స్ఫూర్తి ఆశయాలను ఆకాశమంత ఎత్తులో ప్రతిభంబించేలా.. సగర్వంగా నిలిపారు. ఈ నెల 19 వ తేదీన విజయవాడలో అంబేద్కర్ విగ్రహంతో కూడిన స్మృతి వనం ప్రారంభోత్సవానికి ప్రతి ఒక్కరూ కదలి రావాలి.. అంబేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమం చరిత్రలో అజరామరంగా నిలిచిపోతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు



**పెడన, మేజర్ న్యూస్:** గ్రామ దేవత శ్రీ పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి అని ఆలయ ఈవో తిక్కి శెట్టి వీర వెంకట మోహన్ రావు తెలిపారు. మహిమాన్వితురాలైనా అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులతో ఉత్సవ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మొక్కు బడులు ఉన్న భక్తులు అమ్మవారికి సిడిబండ్లను కట్టి అంగరంగ వైభవంగా ఊరేగిస్తూ డప్పు వాయిద్యాలు, మేళ తాళాలు, వీరంగ విన్యాసాలు, సరైన పాటలతో సందడి సందడిగా సాగిన సిడిబండ్ల ఊరేగింపులు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పైడమ్మ అమ్మవారి ఆసాది లు దాసు. లీలా ప్రకాష్, దాసు. శ్యాం ఆలయ అధికారులు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పి హెచ్ సి ఆధ్వర్యంలో ఉత్సవ ప్రాంగణంలో భక్తులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రత్యేక వైద్య సేవలు అందించారు. కాగా సీఐ అభిబ్ బాషా పర్యవేక్షణలో ఎస్సై రవిచంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయటంతో జాతర మహోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి.

## ప్రజా సంఘాల ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు



**జగ్గయ్యపేట జనవరి 5 మేజర్ న్యూస్:** 'సంక్రాంతి ఆటలు యువజన మైత్రికి బాటలు' అనే నినాదంతో డి వై ఎఫ్ ఐ, ఎస్ఎఫ్ఐ, సిఐటియు, ఆవాజ్, ఐద్వా, ప్రజానాట్యం మండలి సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో గ్రామస్థాయి క్రికెట్ పోటీలను రైతు సంఘం సీనియర్ నాయకులు కాకనబోయిన లింగారావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా లింగారావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గత 40 సంవత్సరాలుగా ఆటల పోటీలు నిర్వహించటం అభినందనదాయకమని, ఇటువంటి ఆటల పోటీల వలన గ్రామంలో ఐక్యంగా ఉండటంతో పాటు పేకాట, జూదం, కోడిపందాల వైపు యువత వెళ్లకుండా ఉండుటకు ఈ క్రీడలు ఎంతో ఉపయోగపడతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎస్ నాగమణి, ఎస్ రామనాదం, కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, షేక్ గౌస్ మియా, షేక్ బడే మియా, కె శ్రీనివాసరావు, రావేళ్ల శేషు క్రీడాకారులు పాల్గొన్నారు.

## పేకాట కోడిపందాలపై పోలుకొండ ప్రజలకు అవగాహన కల్పించిన నందివాడ ఎస్ఐ పి.శిరీష



**నందివాడ మేజర్ న్యూస్:** సంక్రాంతి పండుగ పురస్కరించుకొని పేకాట కోడిపందాలపై పోలుకొండ గ్రామ ప్రజలకు శుక్రవారం నందివాడ ఎస్సై పి.శిరీష తన సిబ్బందితో కలసి అవగాహన కల్పించారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని గ్రామంలో ఎవరైనా పేకాట కోడిపందాలు నిర్వహించిన,పాల్గొన్నా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ప్రజలకు ఎస్సై పి.శిరీష వివరించారు. గ్రామంలో ఎవరైనా పేకాట కోడిపందాలు నిర్వహించిన, పాల్గొన్నా వెంటనే నందివాడ పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని పోలుకొండ ప్రజలను ఆమె కోరారు. ఎవరైనా పేకాట కోడిపందాలు అడుతున్నా,పాల్గొన్నా వారిపై నందివాడ పోలీసు వారికి సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచబడతాయని ఆమె తెలిపారు. అదేవిధంగా సంక్రాంతి పండగ పురస్కరించుకొని మద్యం సేవించి వాహనాలను అతివేగంగా అజాగ్రత్తగా నడిపి ప్రమాదాలకు గురి కాకూడదని ప్రజలను ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి

**నందిగామ, జనవరి 5, మేజర్ న్యూస్ :**పట్టణం లోని కాకాని నగర్ మాజీ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య కార్యాలయంలో శుక్రవారం తిరువూరు భారీ బహిరంగ సభకు నందిగామ నియోజకవర్గం నుంచి తరలి వెళ్లే సమావేశం నిర్వహించారు.తెదేపా శ్రేణులు వారి ఏర్పాట్లకై రాష్ట్ర తెలుగుదేశం పార్టీ వారు నియమించిన ప్రత్యేక పరిశీలకులు మాజీ మంత్రివర్యులు ఆలపాటి రాజా , మచిలీపట్నం మాజీ పార్లమెంటు సభ్యులు కొనకళ్ళ నారాయణరావు ,నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య తో కలిసి నందిగామ మండల మరియు పట్టణ తెదేపా నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ 40 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర గలిగిన తెలుగుదేశం పార్టీ ఒక కర్మాగారం దీని నుంచి ఎందరో మంత్రులు, ముఖ్యమంత్రులు అయ్యారు. ఆదివారం తిరువూరులో జరగనున్న నారా చంద్రబాబునాయుడు భారీ బహిరంగ సభను జయప్రదం చేయడంలో అందరం భాగస్వాములు అవుదాం అన్నారు.గ్రామ,గ్రామాన వార్డుల నుంచి తెదేపా శ్రేణులు భారీగా తరలి మన అధినేత నారా చంద్రబాబునాయుడు సభను విజయవంతం చేద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు పెన్షన్లు



**నందిగామ, జనవరి 5, మేజర్ న్యూస్:** పట్టణం లోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల స్థాయిలో వైయస్ఆర్ పెన్షన్ కానుకలను శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు టిడిపి హయాంలో అవ్వ తాతలు పెన్షన్లు పొందటానికి ఎన్ని కష్టాలు పడ్డారో స్వయంగా చూసి.. నేను ఉన్నాను - నేను విన్నాను అని వారికి భరోసా ఇచ్చిన జగనన్న నేడు ఆ మాటను నిలబెట్టుకున్నారన్నారు. వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు పింఛన్లను దశలవారీగా పెంచుకుంటూ రూ.3 వేల వరకు ఇస్తానని చెప్పిన మాట మేరకు చేసి చూపించారని చెప్పారు. ప్రతి నెలా ఒకటో తారీకునే వారి తలుపు తట్టి పింఛను సొమ్ము అందించి సీఎం జగన్ మోహన్ రెడ్డి వారి మనసులు గెలుచుకున్నారని కొనియాడారు. ఒకరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడకుండా పింఛను సొమ్ము ఆత్మగౌరవాన్ని ప్రతిభంబించేలా కుటుంబంలో విలువను కూడా పెంచుతుందని.. అంతేకాక ఆసరా తో పాటు ధీమా ధైర్యాన్ని ఇస్తుందన్నారు. ప్రతి ఇంటికి పెద్ద కొడుకులా ముందు చూపుతో సీఎం జగనన్న వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె..



**జగ్గయ్యపేట జనవరి 5 మేజర్ న్యూస్ :** పట్టణంలో అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న నిరసన కార్యక్రమానికి ఏఐటియుసి అనుబంధ కార్మిక సంఘాలైన జగ్గయ్యపేట మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, కార్పెంటర్ వర్కర్స్ యూనియన్, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్, చిల్లకల్లు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అన్ని కార్మిక సంఘాలు నిరసన కార్యక్రమానికి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు న్యాయ మైన కోర్కెలు కొరరాని కానీ ప్రభుత్వం ఒట్టేద్దు పోకడ అవలంభిస్తుందని ఇలా చేస్తే జగన్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఇకనైనా ప్రభుత్వం అలోచించి కార్మికులకు తగు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నీలకంఠ శివప్రసాద్, కార్యదర్శి వేముల శ్రీను, ఉపాధ్యక్షులు కర్ల జోజి, చిట్యాల మల్లయ్య, వీర్ల శ్రీనివాస రావు, బత్తుల వెంకటేశ్వర్లు, చిక్కుడు నాగేశ్వరరావు, చిల్లకల్లు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు యాదగిరి, కార్పెంటర్ వర్కర్స్ యూని యన్ శ్రీనివాసరావు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.

# అపర సంజీవనిలా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఆరోగ్యమే మహాభాగ్యం'. అందరికీ ఆరోగ్యమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పరిపాలన సాగిస్తోంది. పేదల ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం కృషిచేస్తోంది. మెరుగైన వైద్యం అందించేలా తపిస్తోంది. ఈ ఫలితంగా పల్లె ముంగిటకే ఆరోగ్య సేవలు తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టింది. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ కార్యక్రమంలో భాగంగా జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామంలో శుక్రవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ రోగులను పరామర్శించారు.అపర సంజీవనిలా ఆరోగ్యశ్రీ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం పేద ప్రజలకు అపర సంజీవంగా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమన్నారు. వైయస్సార్ ఆరోగ్యశ్రీ కింద వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు, చికిత్సల సంఖ్యను ఏకంగా 3,257కు పెంచారని పేర్కొన్నారు.అనారోగ్య సమస్యలు ఉన్నవారిని వైద్య శిబిరాలకు తీసుకురావడం, ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మెరుగైన వైద్యం అవసరం ఉన్నవారిని పెద్ద ఆస్పత్రులకు పంపి ఉచితంగా అందేలా చేయడం ఈ కార్యక్రమంలో ఒక భాగమన్నారు. రోగి పూర్తిగా కోలుకునే వరకు ఆరోగ్యమిత్ర, ఏఎన్ఎంల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఇలాంటి గొప్ప కార్యక్రమాలను దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని, ఒక్క ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రమే చేస్తోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్యాన్ని ఉచితంగా, వేగంగా అందించాలనే గొప్ప లక్ష్యంతో సీఎం జగనన్న పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులను కూడా కొత్తవి మంజూరు చేసి జగనన్న ఆరోగ్య సురక్ష-2లో భాగంగా ఇంటింటికీ వెళ్లి అందజేస్తున్నామని చెప్పారు. ఆరోగ్య ఆసరా తో రోగులకు చికిత్సకాలంలో ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు వెల్లడించారు. సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకొని అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



## పేదవారికి నిజమైన పండుగ వైస్సార్ పెన్షన్ కానుక.

**జగ్గయ్యపేట జనవరి 5 మేజర్ న్యూస్ :** పట్టణంలో ఉక్కు కళావేదిక నందు గురువారం సాయంత్రం ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను ఆదేశానుసారంగా లబ్ధిదారులందరికీ పెంచిన పెన్షన్లను పట్టణ వైఎస్ఆర్సిపి నాయకులతో కలిసి మున్సిపల్ చైర్మన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ లో పేదరికాన్ని అనుభవిస్తున్న వృద్ధులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, వితంతువులు, మత్స్యకారులు, కల్లు గీత కార్మికులు, కళాకారులు, చెప్పులు కుట్టే వారు తదితరులకు ఈ వైస్సార్ పెన్షన్ కానుక ఒక వరంగా భావిస్తున్నానని, తమను తాము పోషించుకోలేని పరిస్థితి ఏ కుటుంబానికి రాకూడదనే ఆలోచనతో ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తామని తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి వర్యులు వైస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని, వారికి ఈ జగ్గయ్యపేట ప్రజల నుండి కృతజ్ఞతలు తెలిచేస్తున్నామని అన్నారు ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ జగన్ మోహన్ రెడ్డి తనదైన పరిపాలనతో ప్రజల మదిలో సుస్థిర స్థానం సంపాదించారని, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ వారి కుటుంబాలల్లో సంతోషాలు నింపారని, ఇక సీఎం జగన్..రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పథకాలు రెండిటిని జోడెద్దెలుగా పరిగెత్తిస్తున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్ రావు,షేక్ హాఫీజున్నిసా, కేడిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సచివాలయం కన్వీనర్లు తుమ్మేపల్లి నరేంద్ర,కన్నామాల శామ్యూల్,పట్టణ వైఎస్ఆర్సిపి అధ్యక్షులు ఆకుల బాజీ, కౌన్సిలర్ సభ్యులు,కో ఆప్షన్ సభ్యులు,తదితరులు, పాల్గొన్నారు.

## తిరువూరు సభకు జనాసమీకరణ దిశానిర్దేశం



**మచిలీపట్నం, మేజర్న్యూస్ :** ఈ నెల 7వ తారీఖు తిరువూరు లో జరుగుతున్న చంద్రబాబు మీటింగ్ కి విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 58,59,60,61,62,63,64 డివిజన్లకు రాష్ట్ర పార్టీ నియమించిన పరిశీలకుల్లాగా హాజరైనా కృష్ణా జిల్లా టీడీపీ తెలుగురైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ. ముందుగా సెంట్రల్ టీడీపీ ఇంచార్జ్, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు బోండా ఉమా ని మర్యాదపూర్వకంగా కలిసి 7 డివిజన్లకు సంబందించిన డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు, ఇంచార్జులు, జనసేన నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి 7 తారీకున తిరువూరు సభకు జనాసమీకరణ దిశానిర్దేశం చేసిన కృష్ణా జిల్లా తెలుగురైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, మాచవరం దాసాంజనేయస్వామి టెంపుల్ కమిటీ మాజీ చైర్మన్ సుంకర కృష్ణ,7 డివిజన్ల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్తరంగాపురంలో రూ.1.కోటితో రహదారి అభివృద్ధి



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** కొత్త మంగాపురం గ్రామంలో రూ.1.కోటితో నిర్మించనున్న రహదారి అభివృద్ధి పనులకు స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు శుక్రవారం శంకుస్థాపన చేశారు. 500 మీటర్ల పొడవునా ఐ.కె రోడ్డు (ఇబ్రహీంపట్నం-కొండూరు) నుంచి రుద్రవరం వరకు వయా కొత్తమంగాపురం మీదుగా సిమెంట్ రహదారి నిర్మించనున్నారు. దీనికి రహదారులు భవనముల శాఖ నుంచి క్యాపిటల్ గ్రాంట్ నిధులు 100 లక్షలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూమైలవరం నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సమస్య తీవ్రతను బట్టి ప్రాధాన్యత క్రమంలో నిధులను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. సిమెంట్ రహదారి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్కి హారతులు ఇచ్చి ఘనస్వాగతం పలికారు. ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బుద్దాలపాలెం గ్రామాభివృద్ధికి బాటలు వేసుకోవాలి



**మచిలీపట్నం, మేజర్న్యూస్ :** జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ బుద్దాలపాలెం గ్రామ పర్యటన గ్రామ టీడీపీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. బందరు మండలం బుద్దాల పాలెంగ్రామంలో జనసేన టిడిపి ఉమ్మడి కార్యచరణ తదితర అంశాలను సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా బండి రామకృష్ణ మాట్లాడుతూ రేపు జరగబోయే ఎన్నికల్లో జనసేన టిడిపి శ్రేణులు ఐకమత్యంగా ఉండి జనసేన టిడిపి ఉమ్మడి అభ్యర్థిని గెలిపించి బుద్దాలపాలెం గ్రామాభివృద్ధికి బాటలు వేసుకోవాలని జనసేన పార్టీ మచిలీపట్నం ఇన్చార్జి బండి రామకృష్ణ గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలు గ్రామంలోని సమస్యలను రామకృష్ణ దృష్టికి తీసుకువస్తూ పంచాయతీ కార్యాలయం అభివృద్ధి, తాగునీటిసమస్య, రోడ్లపరిస్థితి, స్మశానవాటికల అభివృద్ధిలేమి, పాడిపరిశ్రమ అభివృద్ధికిప్రభుత్వ సహకారలేమి తదితర సమస్యలను ప్రస్తావిస్తూ జనసేన టిడిపికూటమికి బుద్దాలపాలెం మద్దతుగా నిలుస్తుందని రానున్న ఎన్నికల్లో ఈ గ్రామం నుండి అత్యధిక మెజార్టీ ఇస్తామని గ్రామ ప్రజలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గద్దం రాజు, చౌదరి, కొక్కు లక్ష్మణరావు, అందేలక్ష్మణ, వీరనాగు, కాగిత మురళి, శ్రీరామ్, పరసాసుబ్రహ్మణ్యం, వీరబాబు, నాగేంద్రరావు, ప్రసాద్, మోకారవి గ్రామ జనసేన టిడిపి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.